నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
బుధవారం | జూన్ 5, 2024 | www.navatelangana.com

కడియం కావ్య గెలువడం అభినందనీయం

దేశంలో ఇండియా కూటమికి మంచి ఫలితాలు

అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ పార్లమెంట్ స్థానాన్నికాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపొందడం అభినందనీయమని అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ ఏనుమాము న్యూ గ్రెన్ మార్కెట్ ఆవరణంలో కడియం కావ్య భారీ మెజారిటీతో విజయం సాధించినందుకు మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్పుర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు,



కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి స్వర్ణ, మార్నేని రవీందర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మిఠాయిల పంపిణీ చేసుకున్నారు. అనంతరం పత్రికా విలేకరుల సమక్షంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. దేశంలో ఇండియా కూటమికి మంచి ఫలితాలు వచ్చాయని అన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడం ఆంధ్రప్రదేశ్ ప్రజల అదృష్టంగా భావిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుని జైలుకు పంపిన రోజే జగన్ ఓటమి తేలిపోయిందన్నారు. కక్షసాధింపు చర్యలతోనే జగన్ ఓటమి పాలయ్యాడని అన్నారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ అధికారాన్ని ప్రజా సేవకు సద్వినియోగంచేసుకోవాలన్నారు. అధికారం రాగానే అహంకారంతో ప్రతిపక్షాల పట్ల చిన్న చూపు చూసి కేసులతో వేధిస్తే ప్రజాల చిత్కరానికి గురౌతారని, ఇదే ఫలితం ఆంధ్రాలో వచ్చిందన్నారు.జగన్ ఓటమి పొంది చంద్ర బాబు నాయుడు గెలుపొందారని అన్నారు.

ఉమ్మడి వరంగల్‌లో హస్తంహవా

వరంగల్ పోస్టల్‌లో కాంగ్రెస్‌కు 648 మెజార్టీ

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు 5,728, బిజెపి అభ్యర్థి అరూరి రమేష్‌కు 5,080, బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌కు 1,213 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ కావ్యకు పోస్టల్ బ్యాలెట్‌లో 648 ఓట్ల మెజార్టీ వచ్చింది.

మహబూబాబాద్ నియోజకవకర్గ

పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కే మెజార్టీ

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కు 4,269 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి కవితకు 1,193, బిజెపి అభ్యర్థి సీతారాంనాయక్‌కు 1,669 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో బిజెపి అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్‌పై కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌కు 2,600 ఓట్ల మెజార్టీ వచ్చింది. బిఆర్ఎస్ అభ్యర్థి కవిత పోస్టల్ బ్యాలెట్‌లో మూడోస్థానానికి పరిమితమయ్యారు.

వరంగల్‌లో డాక్టర్ కావ్య, మహబూబాబాద్‌లో బలరానాయక్ విజయకేతనం
వరంగల్ 'తూర్పు'లో హస్తం పరాభవం
6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగిన 'హస్తం' మెజార్టీ
స్టేషన్‌ఘన్‌పూర్‌లో భారీ మెజార్టీ
మూడోస్థానానికి పరిమితమైన బీఆర్ఎస్
బీఆర్ఎస్ ఓటింగ్ బిజెపికే..
పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కే మెజార్టీ



'స్టేషన్'లో భారీ మెజార్టీ

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు తన తండ్రి కడియం శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో భారీ మెజార్టీ లభించింది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో కాంగ్రెస్‌కు అన్ని నియోజకవర్గాల కంటే ఎక్కువగా 54వేల 425 ఓట్ల భారీ మెజార్టీ వచ్చింది. భూపాలపల్లి నియోజకవర్గంలో 39 వేల 832, పాలకుర్తిలో 39వేల 415 ఓట్ల మెజార్టీ రావడం గమనార్హం.



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోలోని వరంగల్ (ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ) పార్లమెంటు నియోజకవర్గాల్లో హస్తం హవా వీచింది. మంగళవారం పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో ఈ రెండు స్థానాల్లో విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతుంది. ఈ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సిపిఐ (ఎం), సిపిఐ పార్టీలు మద్దతు ప్రకటించి ప్రచారం నిర్వహించిన విషయం విదితమే. తెలంగాణ జన సమితి, ఇతర ప్రజా సంఘాలు సైతం బిజెపిని ఓడించడంలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించాయి. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో నిర్వహించగా, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు మహబూబాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, తన సమీప బిజెపి ప్రత్యర్థి అరూరి రమేష్‌పై 2 లక్షల 20 వేల 339 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. కడియం శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ నుండి 54 వేల 525 ఓట్ల భారీ మెజార్టీ కాంగ్రెస్‌కు వచ్చింది. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తన సమీప బిఆర్ఎస్ ప్రత్యర్థి మాలోత్ కవితపై 3 లక్షల 49 వేల 165 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచారు. ఇక్కడ ఇల్లందు నుండి 59 వేల 299, నర్సంపేట నుండి 55,111, మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నుండి 53,233 ఓట్ల భారీ మెజార్టీ లభించింది. ఈ రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకే విజయావకాశాలున్నాయని 'నవతెలంగాణ' ముందస్తుగానే అంచనా వేసిన విషయం విదితమే. బిఆర్ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో మూడోస్థానానికే పరిమితమైంది. ఈ పార్లమెంటు నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఓటింగ్ బిజెపికి బదిలీ అయినట్టు కనిపించింది. ప్రధానంగా వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి వుందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పార్లమెంటు నియోజకవర్గాలు వరంగల్, మహబూబాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతుంది. 2019 ఎన్నికల్లో ఈ రెండు పార్లమెంటు నియోజకవర్గాలను భారీ మెజార్టీతో గెలుచుకున్న భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో మూడోస్థానానికి పరిమితం కాగా, మహబూబాబాద్ పార్లమెంటు నియోజక వర్గంలో రెండోస్థానంలో వున్న గట్టి పోటీనివ్వలేకపోయింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో చెరి 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే విజయం సాధించడం గమనార్హం. ఇదిలావుంటే వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో బిఆర్ఎస్ గెలిచిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరి తన కూతురు డాక్టర్ కడియం కావ్యకు పార్టీ టికెట్ ఇప్పించుకొని గెలిపించుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో బిజెపి, బిఆర్ఎస్‌లు 'కడియం' కేంద్రంగానే విమర్శలు గుప్పించిన విషయం విదితమే. అయినా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య 2 లక్షల 20 వేల 339 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడం విశేషం. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు మొత్తం 5 లక్షల 81 వేల 294 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి అరూరి రమేష్‌కు 3 లక్షల 60 వేల 955 ఓట్లు, బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌కు 2 లక్షల 30 వేల 820 ఓట్లు వచ్చాయి. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, తన సమీప బిఆర్ఎస్ ప్రత్యర్థి, సిట్టింగ్ ఎంపి మాలోత్ కవితపై 3 లక్షల 49 వేల 165 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడం గమనార్హం. కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కు 6 లక్షల 12 వేల 774 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు 2 లక్షల 63 వేల 609 ఓట్లు, బిజెపి అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్‌కు 1 లక్షా 10 వేల 444 ఓట్లు వచ్చాయి. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం భద్రాచలంలో నియోజకవర్గంలోనే బిఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందగా, ఆ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్‌లో చేరడంతో బిఆర్ఎస్ మరింత బలహీనపడింది. గతంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేసన బలరాంనాయక్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్న ప్రచారం ముందునుండే కొనసాగింది. ఇక్కడ సిపిఐ (ఎం), సిపిఐ పార్టీలు బలంగా వుండడం, ఈ రెండు పార్టీలు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంతో భారీ మెజార్టీ సాధించగలిగారు.

వరంగల్ 'తూర్పు'లో హస్తం పరాభవం

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లో 6 నియోజకవర్గాల్లో మెజార్టీ సాధించిన కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చతికిలపడింది. ఇక్కడ కాంగ్రెస్‌పై బిజెపికి 7,954 ఓట్ల మెజార్టీ లభించడం గమనార్హం. ఈ పార్లమెంటు ఎన్నికల్లో మంత్రి కొండా సురేఖ మెదక్ పార్లమెంటు నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరించడం, మరోవైపు 'తూర్పు'లో ముందు నుండి ప్రజలకు అందుబాటులో వుండకపోవడం క్యాడర్‌లోనూ తీవ్ర అసంతృప్తి వుండడంతో బిజెపి ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని మెజార్టీ సాధించింది. అటు మెదక్‌లో కాంగ్రెస్ ఓడిపోవడం, ఇక్కడ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీపై బిజెపి మెజార్టీ సాధించడం 'కొండా'కు ఘోర పరాభావంగా పరిణమించింది.

6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగిన 'హస్తం' మెజార్టీ

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వరంగల్ తూర్పును మినహాయించి మిగతా 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీని కొనసాగించింది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌పై 54 వేల 425 వేల భారీ మెజార్టీ సాధించడం గమనార్హం. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌పై 39 వేల 415 ఓట్ల మెజార్టీ సాధించింది. పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్, బిజెపిపై 31 వేల 559 ఓట్లు, వరంగల్ పశ్చిమలో కాంగ్రెస్, బిజెపిపై 2,789 మెజార్టీని, వర్ధన్నపేట (ఎస్సీ)లో కాంగ్రెస్, బిజెపిపై 36 వేల 811 మెజార్టీని, భూపాలపల్లిలో కాంగ్రెస్, బిజెపిపై 39 వేల 832 ఓట్ల మెజార్టీని సాధించాయి.

మూడోస్థానానికి పరిమితమైన బీఆర్ఎస్

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ మూడోస్థానానికి పరిమితమైంది. 2014, 2015 ఉప ఎన్నిక, 2019 పార్లమెంటు ఎన్నికల్లో టిఆర్ఎస్ భారీ మెజార్టీతో ఈ స్థానాన్ని నిలబెట్టుకుంది. అలాంటి వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య తన సమీప బిజెపి ప్రత్యర్థి అరూరి రమేష్‌పై 2లక్షల19వేల691 ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం విశేషం. సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురిగా కడియం కావ్య ప్రజల్లోకి చొచ్చుకుపోగలిగారు. వామపక్షాల మద్దతు తోడై భారీ మెజార్టీతో గెలిచారు. బీఆర్ఎస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో రెండోస్థానంలో వుండగా, వరంగల్ పశ్చిమ, తూర్పు, భూపాలపల్లి, పరకాల నియోజకవర్గాల్లో మూడో స్థానానికి పరిమితమైంది.

బీఆర్ఎస్ ఓటింగ్ బీజేపీకే..

పలు నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ ఓటింగ్ బిజెపికి వెళ్లినట్లు స్పష్టంగా కనిపించింది. హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రాతినిధ్యం వహించిన వరంగల్ పశ్చిమలో బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమై కేవలం 19వేల680 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. తూర్పు నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్‌కు కేవలం 20వేల360ఓట్లు మాత్రమే వచ్చాయి.

మహబూబాబాద్‌లో కాంగ్రెస్ విజయం

మహబూబాబాద్ (ఎస్టీ) పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తన సమీప బిఆర్ఎస్ ప్రత్యర్థి మాలోత్ కవితపై 3 లక్షల 49 వేల 165 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌కు 6 లక్షల 12 వేల 774 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు 2 లక్షల 63 వేల 609 ఓట్లు, బిజెపి అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్‌కు 1 లక్షా 8 వేల 775 ఓట్లు వచ్చాయి. ఈ పార్లమెంటు నియోజక వర్గంలోని మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిక్యాన్ని చాటుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో భద్రాచలం (ఎస్టీ) నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన తెల్లం వెంకట్రావు ఎమ్మెల్యేగా విజయం సాధించి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ వచ్చింది. ఈ పార్లమెంటు నియోజకవర్గంలో సిపిఐ (ఎం), సిపిఐ పార్టీలు బలంగా వుండడం, ఆ రెండు పార్టీలు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఖాయమైంది.

అన్ని నియోజకవర్గాల్లో మెజార్టీలే..

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ లభించింది. అత్యధికంగా ఇల్లందు (ఎస్టీ) నియోజకవర్గంలో 59 వేల 299 ఓట్ల భారీ మెజార్టీ లభించింది. నర్సంపేటలో 55 వేల 111, మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు (ఎస్టీ) నుండి 53 వేల 233 ఓట్ల భారీ మెజార్టీ వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలిచిన భద్రాచలం నియోజకవర్గంలోనూ కాంగ్రెస్‌కు 34 వేల 231 ఓట్ల మెజార్టీ లభించింది. ఇక్కడ బిఆర్ఎస్ నుండి గెలిచిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే.

వరంగల్ శాసనసభ నియోజకవర్గవర్గాల వారిగా..

అభ్యర్థి	స్టేషన్‌ఘన్‌పూర్	పాలకుర్తి	పరకాల	పశ్చిమ	తూర్పు	వర్ధన్నపేట	భూపాలపల్లి	మొత్తం
అరూరి రమేష్ (బీజేపీ	40,332	28,452	44,841	60,611	74,581	57,427	49,631	3,60,955
కడియం కావ్య (కాంగ్రెస్)	98,145	87,293	76,400	63,400	66,627	94,238	89463	5,81,294
మారపల్లి సుధీర్ (బీఆర్ఎస్)	43.720	47,878	36,477	19,680	20,360	31,345	31,360	2,30,820

మహబూబాబాద్ శాసనసభ నియోజకవర్గవర్గాల వారిగా..

అభ్యర్థి	డోర్నకల్	మహబాద్	నర్సంపేట	ములుగు	పినపాక	ఇల్లందు	భద్రాచలం	మొత్తం
సీతారాం నాయక్	9,884	7,684	24,220	19,029	15, 170	12,494	10,294	1,10,444
మాలోత్ కవిత	50,293	52,128	45,228	33,592	28,111	33,658	19,406	2,63,609
బలరాంనాయక్	95,306	1,02,011	1,00,339	86,825	77,430	92,957	53,637	6,12,774

వరంగల్ పార్లమెంట్ సభ్యులురాలిగా ఎన్నికైన డాక్టర్ కడియం కావ్య

అభ్యర్థినికి ధ్రువీకరణ పత్రం అందచేసిన రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎనుమా ముల మార్కెట్ యార్డులో నిర్వ హించిన ఎన్నికల కౌంటింగ్ హాలులో జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.ప్రావీణ్య అధికారికంగా డాక్టర్ కడియం కావ్యకు ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య వెంట మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్య నారాయణరావు, వరంగల్ డీసీసీ అధ్యక్షు రాలు ఎర్రబెల్లి స్వర్ణరాజేశ్వర్‌రావు తదితరులున్నారు.

ప్రజలే గెలిచారు..

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

నవతెలంగాణ-హసన్‌పర్తి

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ప్రజలే గెలిచారని కాంగ్రెస్ పార్టీ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. వరంగల్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య 2 లక్షల 19,691 ఓట్ల మెజార్టీతో జయకేతనం ఎగురవేశారు. డాక్టర్ కడియం కావ్య విజయం సాధించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు ర్యాలీ నిర్వహించి టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపు కున్నారు. డాక్టర్ కడియం కావ్యపై ప్రజలు, అభిమానులు పూలవర్షం కురిపిస్తూ, జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలతో పాటు అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూఎంపీ ఎన్నికల ఫలితాలలో ప్రజలు ఇచ్చిన తీర్పు తాము



ఊహించిందేనన్నారు. డాక్టర్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. ఎంపీగా గెలవడంతో ప్రజలపై నాకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలను పొందేందుకు కృషి చేస్తానన్నారు. మొదటి నుంచి మహిళల సమస్యల కోసం కడియం ఫౌండేషన్ ద్వారా పనిచేశానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, నేను ఎంపీ అభ్యర్థిగా ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. అర్బన్‌లో బీజేపీకి బలం ఉంటుందని ప్రచారం జరిగినా.. కాంగ్రెస్ మెజార్టీ సాధించిందన్నారు. వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మామునూర్‌లో ఎయిర్ పోర్టు పునరుద్ధరణ సమస్యల పరిష్కారం కోసం కేంద్రంపై ఒత్తిడీ తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తనను ఎంపీగా గెలిపించిన వరంగల్ పార్లమెంటు ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. విజయం సాధించడంలో కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కెఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, గుండు సుధారాణి, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో సంబురాలు

వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపును పురస్కరించుకొని హసన్‌పర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. బస్టాండులో టపాసులు పేల్చి, స్వీట్లు పంచి కేరిం తలు కొడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు సంబురంగా గడిపారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, పోతరాజు ప్రభాకర్, బల్సుకూరి శ్రీనివాస్, వేల్పుల సదానందం, సాయిని రాంరాజు, ఎన్‌టీఆర్ మొగిళి, గొర్రె రమేష్, ముస్కు సదానందం, పుల్ల రవీందర్, నన్నెంశెట్టి స్వామి, వేల్పుల సాంబయ్య తాళ్ల మధు తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
బుధవారం | జూన్ 05, 2024 | www.navatelangana.com

ప్రకృతితో కలిసి జీవనం సాగిస్తేనే మానవాళికి మనుగడ : మంత్రి సురేఖ



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

ప్రకృతిని ప్రేమిస్తూ, ప్రకృతిని పరిరక్షిస్తూ, ప్రకృతితో కలిసి జీవనం సాగిస్తేనే మానవాళికి మనుగడ వుంటుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ అన్నారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంత్రి సురేఖ పర్యావరణ ప్రేమికులు, ప్రజలకు తన సందేశమిచ్చారు. ఈ విశ్వంలో ప్రత్యేకమైన శీతోష్ణస్థితి పరిస్థితులు కలిగి జీవించడానికి అనువైన ఒకే ఒక గ్రహం భూమి అని దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవడం మన విధి అని మంత్రి అన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రకృతి వైపరీత్యాల దష్ట్యా ప్రతి ఒక్కరు పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులు, కాలుష్య నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరమున్నదని తెలిపారు. విచక్షణ మరిచి మనిషి తన అవసరాలు తీర్చుకోవడమే లక్ష్యంగా సాగిస్తున్న కార్యకలాపాలు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయన్నారు. అకాలవర్షాలు, కరువు కాటకాలు, వరదలు, పలు జీవ జాతుల అంతర్ధానం, భూతాపం, సముద్రమట్టాల పెరుగుదల, రుతువుల్లో అవాంఛనీయ మార్పులు వంటి ప్రతికూల పరిస్థితులు మానవాళిని ప్రమాదంలోకి నెడుతున్నాయని అన్నారు. ఈ వైపరీత్యాలు ఇలాగే సాగితే మానవాళి మొత్తం వినాశనం దిశగా పయనించేరోజు ఎంతో దూరంలో లేదని మంత్రి సురేఖ హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాచరణకు తోడు గా ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణకు పూనుకున్నప్పుడే ఆశించిన లక్ష్యాలు సాధ్యమవుతాయని మంత్రి అన్నారు. 'ప్రపంచ పర్యావరణ దినోత్సవ' స్ఫూర్తిని ఏడాది పొడవునా ప్రదర్శిస్తూ, పచ్చదనం పెంపుదలకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కలిసి రావాలని మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు.

భారీ మెజార్టీల నుండి పతనావస్థకు చేరిన బీఆర్ఎస్

- పార్టీ శ్రేణుల్లో అయోమయం, నిరాశ, నిస్పృహలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



బీఆర్ఎస్‌పార్టీ ఈ పార్లమెంటు ఎన్నికల్లో చతికి లపడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో 12 స్థానాలకుగాను కేవలం 2 స్థానాల్లో గెలిచింది. ఎన్నికల ఫలితాల అనంతరం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో వరుస విజయాలు సాధించి భారీ మెజార్టీలతో రికార్డులు సృష్టించిన బీఆర్ఎస్ తాజా ఎన్నికల్లో భారీఓటమిని మూటగట్టుకుంది. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో 2014లో టిఆర్ఎస్ నుండి పోటీ చేసిన కడియం శ్రీహరి 3 లక్షల 50 వేల 211 ఓట్ల భారీ మెజార్టీలో విజయం సాధించారు. అనంతరం 'కడియం'ను నాటి సీఎం కేసీఆర్ తన మంత్రివర్గంలో డిప్యూటీ సీఎంగా తీసుకున్నారు. దీంతో 'కడియం' ఎంపి పదవికి రాజీనామా చేశారు.

ఈ క్రమంలో 2015లో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో టిఆర్ఎస్ అభ్యర్థిగా పసునూరి దయాకర్ తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి సర్వే సత్యనారాయణపై 4 లక్షల 59 వేల 92 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచారు. 2014లో టిఆర్ఎస్ నుండి పోటీ చేసి ఎంపిగా గెలిచిన కడియం శ్రీహరికి 6 లక్షల 61 వేల 639 ఓట్లు వచ్చాయి. 2015లో టిఆర్ఎస్ నుండి పోటీ చేసిన పసునూరి దయాకర్‌కు 6 లక్షల 15వేల 403 ఓట్లు వచ్చాయి. 2019లో ఇదే నియోజకవర్గం నుండి టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పసునూరి దయాకర్‌కు 6 లక్షల 12 వేల 498 ఓట్లు రాగా, తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి దొమ్మాటి సాంబయ్యపై 3 లక్షల 50వేల 298 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచారు. ఈ నియోజకవర్గంలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సిరిసిల్ల రాజయ్య తన సమీప టిఆర్ఎస్ ప్రత్యర్థి డాక్టర్ రామగల్ల పరమేశ్వర్‌పై 1 లక్షా 24 వేల 661 ఓట్ల భారీ మెజార్టీతో విజయంసాధించారు. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో వరుసగా జరిగిన మూడుఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన బిఆర్ఎస్ తాజా ఎన్నికల్లో బొక్కబోర్లపడింది. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ మూడోస్థానానికి పరిమితం కావడం గమనార్హం. తాజా అసెంబ్లీ ఎన్నికల్లోనే బిఆర్ఎస్ 12 అసెంబ్లీ స్థానాలకుగాను కేవలం 2 స్థానాల్లో గెలవగా, ఫలితాల అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ నుండి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బిఆర్ఎస్‌కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాత్రమే మిగిలారు.

మారనున్న సమీకరణలు

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడం, బిఆర్ఎస్ మూడోస్థానానికే పరిమితం కావడంతో ఆ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇతర పార్టీల్లోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎవరికి వారు రాజకీయ భవితవ్యం కోసం ఆయా పార్టీల నుండి హామీ తీసుకొని పార్టీ మారడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తాజా ఎన్నికల ఫలితాలతో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్, బిజెపిలోకి వలసలు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కడియం కావ్యకు అభినందనలు

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



ఇండియా కూటమి వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా 2.19 లక్షల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్యకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య అభినందనలు తెలిపారు. కాజీపేట మండలం సీపీఎం విస్తృత సమావేశం మంగళవారం చంటి రవి అధ్యక్షతన నిర్వహించగా ఎం.చుక్కయ్య ముఖ్య అతిథిగా హాజరై వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన కడియం కావ్యకి అభినందనలు తెలియజేశారు. ఈ విజయం కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ప్రజాతంత్ర శక్తులందరు కలిసి సాధించిన సమిష్టి విజయమన్నారు. ఎన్నికల సందర్భంగా కడియం కావ్య పేద ప్రజలకు ఏవైతే హామీలు ఇచ్చారో వాటిని అమలుచేసే విధంగా కృషి చేస్తూ పేద ప్రజలపక్షాన నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతితో నల్లబెల్లిలో విషాదం

నవతెలంగాణ-నల్లబెల్లి



వివాహం జరిగిన నెల రోజులకే వరుడు అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే నల్లబెల్లి మాజీ సర్పంచ్ కొత్తపల్లి కోటిలింగా చారి కుమారుడు కొత్తపల్లి ప్రణయ్ (30)కి నాలుగు రోజుల క్రితం ఆరోగ్యం బాగా లేకపోవడంతో హనుమకొండలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో పరీక్షలు చేయించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించిందని మెరుగైన చికిత్సనిమిత్తం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన యశోద హాస్పిటల్ తర లించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం ఉదయం మృతి చెందారు. భార్య తల్లిదండ్రులతో సంతోషంగా గడపాల్సిన యువకుడు అనారోగ్య సమస్యలతో మృతిచెందడం పట్లా కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

వరంగల్ పశ్చిమలో టీడీపీ శ్రేణులు సంబరాలు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



ఆంధ్రప్రదేశ్లో టిడిపి కూటమి విజయం సాధించడంతో టిడిపి హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ఎండి.రహీమ్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రహీమ్ మాట్లాడుతూ ఏపీ లో అరాచకపాలన పోయిందని ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని, తెలంగాణలో కూడా టీడీపీ బలోపేతమవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర, పార్లమెంట్‌స్థాయి నాయకులు పుల్లయ్య, ఇమామ్, శ్యాంసుందర్, అనిశెట్టి సతీష్, బర్ల యాకూబ్, జయశంకర్, మనోహర్, సురేష్, బింగి మల్లేశం, కొంగర ప్రభాకర్, అనిల్ కుమార్, కుమారస్వామి, ఆఫీస్ మేనేజర్ మచ్చ లక్ష్మణ్,మార్గం సారంగం, పూర్ణచందర్ రావు, సిరాజ్ పాల్గొన్నారు.

జల వనరుల్లో మట్టి తోడేళ్లు...

- పోచమ్మ కుంట చెరువులో మట్టిదందా
- గ్రామస్తుడు అడ్డుకున్నా ఆగని మట్టి రవాణా
- ఆర్ అండ్ బి రోడ్డు కాంట్రాక్ట్ పనులకు మట్టి తరలింపు



నవతెలంగాణ-నడికూడ

మండలంలోని పులిగిల్ల గ్రామ పోచమ్మ కుంట (తుమ్మలకుంట) చెరువులో దర్జాగా అడిగే వారే లేరు అన్నట్టు ఆర్ అండ్‌బీ రోడ్డు కాంట్రాక్టర్ అక్రమమట్టి దందా గత నాలుగు రోజులుగా సుమారు 10ఫీట్ల లోతుతో మట్టి తీసి తరలిస్తున్నాడు. చెరువులో జేసీబీ, లారీల సహాయంతో మట్టి తీసి పరకాల మండలం మలకపేట శివారు నుండి నడికుడ మండలం నార్లపురం వరకు ఆర్‌అండ్‌బి రోడ్డు సొంత కాంట్రాక్టు పనులకు రోడ్డుకు ఇరువైపులా యదేచ్ఛగా పోసుకుంటున్నాడు. గత నాలుగురోజుల నుండి అక్రమమట్టి తరలిస్తుండగా స్థానికుడు ఇనగాల సాంబయ్య అడ్డుకోగా అక్రమమట్టి దందా ఆపడం లేదు అంటూ సాంబయ్య మీడియాకు సమాచారం ఇచ్చి మీడియా ముఖంగా సాంబయ్య మాట్లాడుతూ పులిగిల్ల గ్రామంలో గత నాలుగు రోజులుగా పోచమ్మ కుంట చెరువులో మట్టితీసి ఆర్‌అండ్‌బి రోడ్డు కాంట్రాక్టు పనులకు తీసుకెళ్తున్నారని, చెరువులో భూగర్భ జలాలు అడుగంటి పోయే విధంగా సుమారు 10 ఫీట్ల లోతు మట్టి తీసి చెరువును మొత్తం గుంతలమయం చేస్తున్నారని, మా గ్రామ అవసరాలకు మొరం కావాలం టే మేము ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశాడు.



సొంత కాంట్రాక్టు పనులకు, ఆర్‌అండ్‌బిరోడ్డుకు మా చెరువు నుండి మొరం తరలిస్తున్న వారిపై జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ మట్టి దందా చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని తీసిన మట్టికి భారీ జరిమానా విధించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సాంబయ్య మీడియా ముఖంగా కోరారు. అధికార పార్టీ బడా నాయకుడి అండదండలతోనే అక్రమ మట్టి దందా నిర్వహిస్తున్నట్లు పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. చరవాణి ద్వారా సదరు కాంట్రాక్టర్ మాట్లాడుతూ అవును అన్ని అనుమతులు ఉన్నాయి. మీకు కావాలంటే వచ్చి జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ ఈఈ వద్ద చూసుకోండి అనుమతి పత్రాలు మీకు ఇవ్వవలసిన అవసరం లేదు అంటూ చెరువులో అడ్డుకున్న సాంబయ్యపై దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు.

ఇరిగేషన్ జిల్లాఅధికారి సునీతను చరవాణి ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నంచగా చరవాణికి స్పందించలేదు.

ఓట్ల లెక్కింపుకు సహకరించిన ప్రతీఒక్కరికీ ధన్యవాదాలు

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య



నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ ఎస్సీ15 పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్, ఓట్లు లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లాకలెక్టర్ పి.ప్రావీణ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజక పరిధిలో పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్ పశ్చిమ, పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన స్ట్రాంగ్ రూములను కేంద్ర ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్లు బండారి స్వాగత్ రణవీర్‌చంద్, రాజేష్‌కుమార్, ఎన్నికలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో మంగళవారం ఉదయం 6గంటలకు తెరవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, ఈవీఎంల లెక్కింపు చేపట్టడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించుటకు కౌంటింగ్ పరిశీలకులుగా వరంగల్ తూర్పు,వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు బండారి స్వాగత్ రణవీర్ చంద్, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల అసంబ్లీ సెగ్మెంట్లకు రాజేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో తొలి రౌండ్ లెక్కింపు నుండి గెలుపొందిన అభ్యర్థికి ధవ పత్రం అందజేసే వరకు వెన్నంటే ఉండి సమీక్షించడం జరిగిందన్నారు.

ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తూ రౌండ్ రౌండ్‌కు తగు సలహాలు సూచనలు ఇస్తూ తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి పరిశీలకులు వివరించడం జరిగిందన్నారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు చేయడం జరిగిందన్నారు. వినియోగించిన ఈవీఎంలను, వివి ప్యాట్‌లను వాటి నుండి ఓటు వేయడం ద్వారా లభించిన ఓటు స్లిప్పులను విడదీసి పోలింగ్ కేంద్రాల వారిగా ఆయా నియోజకవర్గంలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచేందుకు పటిష్ఠ పోలీస్ఎస్కార్ట్, బందోబస్తు నడుమ తరలించినట్లు ఆమె పేర్కొన్నారు. మంగళవారం జరిగిన లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ఏలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరగడం చాలా సంతోషమన్నారు. పార్లమెంట్ ఎన్నికలు నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసినప్పటి నుండి లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ ఉఎన్నికల అధికారులు, విధులు నిర్వహించిన సిబ్బంది, ప్రజలను, జిల్లా యంత్రాంగం సలహాలు, సూచనల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు చెరవేసిన మీడియా ప్రతినిధులను ఆర్ఓ, కలెక్టర్ ప్రావీణ్య అభినందించారు.

ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, జనగామ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, సిక్తాపట్నాయక్, షేక్‌రిజ్వాన్‌బాషా, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, సంధ్యారాణి, డిసిపిలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నీట్-2024 ఎంట్రెన్స్ ఫలితాల్లో షైన్ ప్రభంజనం



నవతెలంగాణ-నయీంనగర్

నీట్ 2024 ఎంట్రెన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 578 మార్కులు సాధించి కార్పొరేట్ విద్యా సంస్థలకు సమానంగా ఫలితాలను సాధించడం జరిగిందని షైన్ విద్యాసంస్థ చైర్మన్ మూగ కుమార్ యాదవ్, డైరెక్టర్లు పి రాజేంద్ర కుమార్, మూగ రామ, మూగ రమేష్‌యాదవ్‌లు సంయుక్తంగా తెలియజేశారు. మంగళవారం విడుదల చేసిన నీట్ 2024 ఎంట్రన్స్ ఫలితాల్లో 578 మార్కు సాధించిన టీ హెూమప్రియను కాలేజీ యాజమాన్యం అభినందించారు, అలాగే బి.శ్రీపూజ 430మార్కులు, విద్యా శ్రీ 425 మార్కులు, రాయ్ ముస్కాన్ 378 మార్కులు సాధించడం జరిగింది అని తెలిపారు .వీరితోపాటు 20 మంది విద్యార్థులు 300 మార్కులు పైగా ఫలితాలు సాధించారని చైర్మన్ కుమార్ యాదవ్ తెలిపారు. అలాగే షైన్ విద్యాసంస్థలు మొదటి నుండి నీట్ , జేఈఈ మెయిన్స్, అడ్వాన్సులలో అత్యుత్తమైనటువంటి శిక్షలను వరంగల్లో అందించడం జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాలను వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి అకాడమిక్ ప్రోగ్రామింగ్ ప్రణాళికల ద్వారా ఆణిముత్యాలుగా తయారు చేసి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించే విధంగా తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షైన్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ మూగ బోయిన రాజుగౌడ్, కొత్తకొండ శ్రీనివాస్, ప్రవళిక ,అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల ఓట్ల లెక్కింపు తీరును పరిశీలించిన సిపి



నవతెలంగాణ-కాశిబుగ్గ

ఏనుమాముల మార్కెట్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు వేళ పోలీస్ బందోబస్తూ ఏర్పాట్లను కూడా పోలీస్ కమిషనర్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. లెక్కింపు ప్రక్రియలో ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి కనీస వసతులను ఏర్పాటు చేయాల్సిందిగా సీపీ ఎన్నికల అధికారులను అదేశించారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-శాయంపేట / నల్లబెల్లి



పార్లమెంట్ సీట్ల కైవసంపై ధీమా వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ సీట్లను, తెలంగాణ రాష్ట్రంలో ఎంపీ సీట్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న సందర్భంగా మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నల్లబెల్లి, శాయంపేట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో బాణా సంచా పేల్చి సంబరాలను నిర్వహించగా శాయంపేటలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలపై ప్రజల్లో విశ్వా సం పెరిగిందని, పార్లమెంట్ ఎన్నిక ల్లో వరంగల్‌ఎంపీ అభ్యర్థి కడి యం కావ్యను భారీమెజార్టీతో గెలిపించా రని పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి, చార్ల శివారెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పరకా ల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిందం రవి, మారపల్లి రవీం దర్, మామిడి పల్లి సాంబయ్య, ఎండి రఫీ, మారపల్లి రాజు, కట్టయ్య, బాసాని రవి, మామిడి సుదర్శన్, రాజు, వీరన్న, కుమారస్వామి పాల్గొన్నారు.

దామెర మండలంలో కాంగ్రెస్ సంబరాలు

దామెర : వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య గెలుపొందడంతో మండ లంలోని కాంగ్రెస్ శ్రేణులు దామెర, ఓగ్లాపూర్, ఊరుగొండ, దమ్మన్నపేట, వెంకటాపూర్, సింగరాజుపల్లి, పులుకుర్తి, పసరు గొండ మొదలైన అన్ని గ్రామాల్లో పెద్దఎత్తున బాణ సంచా కాల్చి స్వీట్లు పం పిణీ చేస్తూ ఆనందోత్సవాలతో కేరింతలతో నినాదాలతో సంబరాలు జరుపుకున్నారు.

వర్ధన్నపేటలో ఆరూరికి మరోసారి ఎదురుదెబ్బ

- అండగా నిలిచిన వరంగల్ తూరు, పశ్చిమ

నవతెలంగాణ-హసన్‌పర్తి



వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు వర్ధన్నపేట నియోజకవర్గంలో మళ్లీ కోలుకోలేని ఎదురుదెబ్బతీసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మొన్నటి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమిని చవిచూసిన ఆరూరి తిరిగి తన గెలుపు ఖాయం చేసుకునేందుకు పార్టీ మారి బీజేపీలో చేరారు. అంతేకాకుండా తన ఉనికికి ఎటువంటి ప్రమాదం రాకుండా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నుంచి టికెట్ తెచ్చుకున్నాడు. అయినప్పటికి వర్ధన్నపేట నియోజకవర్గ ఓటర్లు మాత్రం వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా చీదరించుకోవడంతో బీజేపీ నుంచి కూడా ఓటమీ పాలుకావడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు వచ్చిన ఫలితాల్లో బీజేపీకి వరగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలే లీడ్ ఇవ్వగా బీఆర్ఎస్ పార్టీ నుంచి వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండు సార్లు భారీ మెజార్టీతో గెలిచినప్పటికీ వర్ధన్నపేట నియోజకవర్గంలో అరూరికి ఆశించిన స్థాయిలో ఓట్లు రాకపోవడం ఆరూరి పట్ల ఆ నియోజకవర్గ ప్రజలకు ఎంత వ్యతిరేకత ఉందో తేటతెల్లమవుతుంది. ప్రస్తుతం అసెంబ్లీ నియొజకవర్గ ఫలితాలే వరంగల్ పార్లమెంట్ నియొజక వర్గ ఎన్నికల ఫలితాల్లో మళ్లీ రిపీట్ కావడం స్పష్టంగా కనిపిస్తుంది.

వర్ధన్నపేట నియోజకవర్గ ఓటర్లు తిరిగి అరూరిని తిరస్కరించడంతో ఇటు అసెంబ్లీ ఎన్నికల్లో అటు పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చిందనే ప్రజలు చెప్పుకుంటున్నారు.

పాలకుర్తిలో అంతంతే..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పట్టున్న పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన మాజీ మంత్రి దయాకర్ రావు వరంగల్ పార్లమెంట్ నియొజకవర్గ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు ఓట్లు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే ప్రచారం జరుగుతోంది. ఎర్రబెల్లి దయాకర్‌రావుపై విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వరంగల్ పార్లమెంట్ నియొజకవర్గ ఎన్నికల్లో కూడా తిరిగి అదే స్థాయిలో ఓట్లు రాబట్టడంలో విజయం సాధించారు. ఇక బీజేపీ అయితే ఇక్కడ ఓటర్లను ఆకర్శించడంలో ఘోరంగా పరాభావమైనట్లు ఓట్ల ఫలితాలను చూస్తే అర్థమవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

భూపాలపల్లిలో..

భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ దూకుడు ఏమాత్రం తగ్గలేదని ఈ ఎన్నికల ఫలితాలను చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. వరంగల్ పార్లమెంట్ నియొజకవర్గ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ఇక్కడ కూడా పరాభావం తప్పలేదని తెలుస్తోంది.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, గతంలో అసెంబ్లీ నియొజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన ఆరూరి ర మేష్, గండ్ర వెంకటరమణారెడ్డిలకు ఈ ఎన్నికల్లో ఓటర్లు చుక్కలు చూపించా రు. ఇక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న గండ్ర సత్యనారాయణ తన హవా ఏ మాత్రం తగ్గకుండా ఎంపీ ఎన్నికల్లో ఓట్లు రాబట్టడంలో సఫలీకృతుడ య్యాడనే చెప్పవచ్చు.

పరకాలలో..

పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యకు ఓటర్లు బారీ మెజారిటీనే ఇచ్చారు. వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన చల్ల ధర్మారెడ్డి ఆ నియోజకవర్గ ఓటర్లను కొంత మేరకు ప్రభావితం చేసినప్పటికి ఫలితం శూన్యమే. వర్ధన్నపేట నియొజకవర్గ ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పనిచేసి బీజేపీ నుంచి పోటీ చేసిన ఆరూరి రమేష్‌ను కూడా పరకాల ప్రజలు ఆదరించకపోవడం కొంత నిరాశగానే కనిపించింది.

స్టేషన్ ఘన్‌పూర్...

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన కడియం శ్రీహరి పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరాడు. అయినప్పటికి ఇక్కడి నియొజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసిన కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకే మద్దతు ఇచ్చి ఆదరించారు. ఈ నియొజకవర్గంలో కడియం కావ్యకు అత్యధిక వ్యతిరేక ఓటు పడుతుందని భావించినప్పటికి ఓటర్లు మాత్రం సరైన తీర్పే ఇచి కావ్యను ఆదరించడం ఎన్నికల ఫలితాలను చూస్తే తెలుస్తోంది. కానీ స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు అందరి అంచనాలను తలకిందులు చేస్తూ నియోజకవర్గ ప్రజలు కడియం శ్రీహరి, కావ్యను ఆదరించడం కొసమెరుపు. ఈ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు ఏ మాత్రం పోటీనివ్వలేకపోయారు.

వరంగల్ పశ్చిమ, తూర్పే...

వరంగల్ పార్లమెంట్ నియొజకవర్గ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ ప్రభావం బీఆర్ఎస్‌కు ఏమాత్రం కలిసి రాలేదనే చెప్పవచ్చు. అంతేకాకుండా వరంగల్ తూర్పులో పట్టున్న మంత్రి కొండా సురేఖ ప్రభావం కూడా ఏమాత్రం ఓటర్లను కదిలించలేకపోయింది. పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో బీజేపీ పార్టీ ఎక్కువ ఓటర్లను ప్రభావితం చేసిందనే ఫలితాలను భట్టి తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గల ప్రజలే బీజేపీకి లీడ్ ఇచ్చినట్లు ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి.

ఈ నియోజకవర్గం నుంచి అత్యధికంగా విజయం సాధించిన దాస్యం వినయభాస్కర్‌తో పాటు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ కూడా ఆయా పార్టీల అభ్యర్థులకు ఓట్లు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే చెప్పవచ్చు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జనగామ
బుధవారం | జూన్ 5, 2024 | www.navatelangana.com

పొడిదుక్కిలోనే విత్తనాలు నాటుతున్న రైతులు



నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

రోహిణి కార్తిలో కురిసిన వర్షాలకు వేసవి దుక్కులు చేసిన రైతులు రోహిణి కార్తి రెండో పాదం చివరి దశలోనైనా వర్షాలు పడకపోతాయన్న ఆశతో రైతులు పొడి దిక్కులోనే విత్తనాలు నాటుతున్నారు. వేసవిలో నైతే విత్తనాలు నాటుటకు గాను అచ్చు తోలుట, కూలీల కొరత ఇబ్బంది ఉండదన్న లక్ష్యంతో ముందుగానే రైతులు విత్తనాలను పొడి దుక్కిలోనే నాటుతున్న పరిస్థితి నెలకొంది. ఈ విషయమై వ్యవసాయ శాఖ వారిని సంప్రదించగా ఏఈఓ ముత్తినేని వెంకటేష్ మాట్లాడుతూ పొడిదుక్కులో నాటినట్లయితే మొలక శాతం పడి పోతుందని అన్నారు. అదేవిధంగా భూమిలో వేడి శాతం ఎక్కువ ఉన్నందున విత్తనాలకు నష్టం వాటిల్లే అవ కాశం కూడా లేకపోలేదని తెలిపారు. విత్తనాలు నాటుటకు సమయం దాటిపోనందున మంచి వర్షం పడ్డ త ర్వాత దుక్కి ఒకసారి దమ్ము చేసి విత్తనాలు నాటినట్లయితే మంచి మొలకశాతం వస్తుందని పేర్కొన్నారు. తద్వారా పంట కూడా ఏపుగా పెరుగుతుందని అన్నారు.




నాడు డాక్టర్ కల్పన... నేడు డాక్టర్ కావ్య..!

- 40 ఏళ్ల వరంగల్ పార్లమెంట్ రికార్డ్ బ్రేక్..!
- రెండో మహిళా ఎంపీగా డాక్టర్ కడియం కావ్య
- నియోజకవర్గంలో బలంగా కాంగ్రెస్ పార్టీ
- ప్రతిష్టాత్మకంగా తీసుకుని నెగ్గిన కడియం శ్రీహరి
- కల్పనాదేవి తర్వాత.. ఎంపీగా కడియం కావ్య 'విజేత'

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి నియోజకవర్గ పునర్విభజన కాక ముందు హనుమకొండ పార్లమెంటు స్థానం నుండి 1984లో డాక్టర్ కల్పనా దేవి టీడీపీ నుంచి ఎంపీగా గెలుపొందారు. 40 ఏళ్ల తర్వాత 2024లో రిజర్వు డు స్థానంగా మారిన వరంగల్ పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎంపీ మహిళా అభ్యర్థిగా బరిలో నిలిచిన కడియం కావ్య పోటీ చేసి సునాయా సంగా విజయం సాధించారు. ఇదే పార్లమెంటు స్థానం నుంచి గెలిచిన మొదటి మహిళ ఎంపీ డాక్టర్ కల్పనా దేవి,తర్వాత గెలిచిన రెండో మహిళా ఎంపీగా డా క్టర్ కడియం కావ్య ఘనత సాధించింది.

వరంగల్ రాజకీయాలను ప్రభావితం చేసే స్టేషన్‌ఘనపూర్ నియోజకవ ర్గం అనూహ్య పరిణామాల మధ్య వరంగల్ రాజకీయాలను ప్రభావితం చేసే మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘనపూర్ ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూ తురుగా, కడియం ఫౌండేషన్ పేరిట అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న సేవకురాలిగా కడియం కావ్య ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టి, ఈసారి వ రంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య మొట్టమొదటిగా ఎన్నికల బరిలో నిలిచి గెలిచింది.

నాలుగు దశాబ్దాల అనంతరం మహిళాకు పట్టం...

వరంగల్ లోకసభ ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే ఒక్క రు మహిళ ఎంపీగా గెలిచారు. వారే డాక్టర్ టీ. కల్పనాదేవి. 1984లో టీడీపీ నుంచి డాక్టర్ కల్పనాదేవి పోటీ చేసి విజయం సాధించారు.ఎంపీగా అనేక సం క్షేమాభివృద్ధి పనులు నిర్వహించగా తనదైన గుర్తింపు పొందారు. అటు తరు వాత 2019 ఎన్నికల వరకు పార్లమెంటు స్థానంలో మహిళ ఎంపీగా ఎవరు గెలవలేదు. 2024లో నూతనంగా రాజకీయాల్లోకి అడుగిడిన డాక్టర్ కడియం కావ్య కాంగ్రెస్ తరఫున నిలిచి పోటీ చేసింది.

మిగిలిన పార్టీలకు చేదు అనుభవమే...

ప్రధాన పార్టీలుగా చెప్పుకుంటున్న బీజేపి, బీఆర్ఎస్‌లు పూర్తిగా చతికిల పడ్డాయి. బీజేపీ తరపున వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పోటీ చేయగా, రెండో స్థానంలో బీఆర్ఎస్ నుంచి డాక్టర్. సుధీర్ కుమార్ పోటీచే సి ఓడిపోయారు.

గెలుపే పరమావధిగా కావ్య చురుగ్గా ముమ్ముందుకు...

వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతం నుంచి రాజకీయ చతురత,అపార అనుభవం, గత పాలనలో అనేక శాఖలలో మంత్రిగా విధులు నిర్వహించి, తనదైన శైలిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేరొందిన ఏకైక నేత, మాజీ ఉపముఖ్యమంత్రి, ప్రస్తుత స్టేషన్‌ఘనపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురుగా, డాక్టర్ కడియం కావ్యను బరిలోకి దింపిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం. అదే స్థా యిలో జనంలోకి ప్రచారం అయ్యారు. వరంగల్ పార్లమెంటులోని ఏడు అసెం బ్లీ నియోజకవర్గ స్థానాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ తూర్పు, పశ్చిమ, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేటలో కాంగ్రెస్ బలంగా ఉంది. ఈ మేరకు కడియం కావ్య వరంగల్ పార్లమెంటు స్థానంలో గెలుపు ఖాయమనే ధీమాతోనే కాంగ్రెస్ నేతలు బరిలో నిలిపారు.

విలక్షణమైన తీర్పిచ్చిన ఓటర్లు...

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాలో స్టేషన్‌ఘనపూర్, జన గామ మినహా ఓడిపోయినా ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో తమ సత్తా చాటి తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలనే అనుకుని, అన్ని పార్టీలకన్నా ముందుగా వరంగల్ లోకసభ స్థానం నుంచి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కూతు రు కడియం కావ్యకు వరంగల్ పార్లమెంటు నియోజక వర్గ టిక్కెట్టు కేటాయిం చింది. ఆమె కూడా తన తండ్రి అండతో వర్ధన్నపేట నుంచి ప్రచారానికి కూడా శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గుర్తించి టికెట్టుఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీ ఆర్‌ను కలిసి కృతజ్ఞతలు కూడా తెలిపింది. కానీ ఊహించని రీతిలో తెల్లవారే సరికి, తన తండ్రితో సహా కాంగ్రెస్ పార్టీలో చేరి షాక్ ఇచ్చింది. ఈ క్రమంలో ఓటర్లు ఎవరికి ఓటెయ్యాలి... ఎవరిని గెలిపించాలనే సందిగ్ధంలో పడ్డారు. కానీ గెలిపించే హక్కు కేవలం ఓటరు చేతిలో ఉన్నది కాబట్టి, విలక్షణమైన తీర్పును అందించి ఓటర్లు కడియం కావ్యకి ఎంపీగా పట్టం కట్టారని పలువురు చెబుతున్నారు.

వీరారం పెద్దమ్మ తల్లి ఆలయంలో చోరీ

నవతెలంగాణ-మరిపెడ

పెద్దమ్మతల్లి ఆలయం తాళం పగలగొట్టి హుండీలోని సొమ్మును దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం గ్రా మంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వీరా రం గ్రామ శివారులో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి ఆలయా న్ని గత ఏడాది దాతల సహకారంతో అన్ని హంగులతో నిర్మించారు. ఈ సంద ర్భంగా ఈనెల 8, 9న పెద్దమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవానికి అన్ని ఏర్పా ట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏడాది నుంచి వివిధ మొక్కుల ద్వారా భక్తులు హుండీలో డబ్బులు వేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తలుపులు పగలగొట్టి గర్భగుడి హుండీలోని సొత్తు అపహరించుకపోయినట్లు ఆలయ కమి టీ సభ్యులు తెలిపారు. చోరీపై మరిపెడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆల య కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



కడియం కావ్య గెలుపుతో సంబరాలు






నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

వరంగల్ పార్లమెంటు నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య భారీ మెజారిటీతో విజయం సాధించడంతో మంగళవారం నియోజకవర్గంలో పార్టీ శ్రే ణులు, కడియం అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని శివుని పల్లిలో కాంగ్రెస్ శ్రేణులు, కడియం అభిమానులు, ఎంపిటిసి బూర్ల లతా శంకర్, గుర్రం రాజు, అభ్యుదయ యువజన సంఘం నియోజక వర్గ కన్వీనర్ పోశాల క్రిష్ణ ఆధ్వర్యంలో భారీ బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామ ఎంపిటిసి మారేపల్లి లలిత, శ్యాం కుమార్ రెడ్డి కావ్యను గెలిపిం చినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో తోట సత్యం, బూ ర్ల రాజు, శ్రీనాథ్, కడియం యువసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరంగల్ పార్లమెంటులో పాలకుర్తిదే పై చేయి...

ఫలించిన వ్యూహం - 39 వేల 749 మెజారిటీ...

పాలకుర్తి : వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మంగళవారం వెలువ డిన ఎన్నికల ఫలితాల్లో పాలకుర్తి నియోజకవర్గం పై చేయిగా నిలిచింది. 2023 ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డికి అండగా నిలవడంతో అదే స్ఫూర్తితో పార్లమెంటు ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవ ర్గం ప్రజలు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు అండగా నిలిచారు. పాలకు ర్తి నియోజకవర్గంలో కడియం కావ్యకు 87293 ఓట్లు లభించగా, బీఆర్ఎస్ అ భ్యర్థి సుధీర్ కుమార్‌కు 47,544 ఓట్లు లభించాయి. బిజెపి అభ్యర్థి ఆరూరి రమే ష్‌కు 28,452 ఓట్లు లభించడంతో మూడవ స్థానానికి పరిమితమయ్యారు. వరం గల్ పార్లమెంటు పరిధిలోగల ఏడు నియోజకవర్గాలలో పాలకుర్తి నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీ ఇవ్వాలనే పట్టుదలతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల య శస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలు అహర్ని శలు కృషి చేశారు. నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని చుట్టుముట్టి ఎంపీటీసీ ల క్లస్టర్ల వారీగా సభలు, సమావేశాలు, పాదయాత్రలు నిర్వహించి ఎన్నికల ప్రచా రాన్ని ఉధృతలూగించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 వరంగల్ పార్ల మెంటు ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్‌కి అండగా నిలిచారు. పాలకుర్తి నియోజకవర్గం నుండి వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య కు అధిక మెజార్టీ ఇచ్చేందుకు అహర్నిశలు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కావ్యగెలుపుపై కాంగ్రెస్ శ్రేణులు బాణా సంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుదాం

ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి

తొర్రూరు : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే స్ఫూర్తితో ముందుకు పోదా మని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మం గళవారం రాత్రి స్థానిక క్యాంప్ కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి అనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి ఆమె మీడియా సమావేశంలో పాల్గొ న్నారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపుకు కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యాలయం ముందు మతాబులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు 45 వేల పైన మెజారిటీ వస్తే డాక్టర్ కావ్యకు పార్లమెంట్ ఎన్నికల్లో మరో 10 వేల మెజా రిటీ ఎక్కువే ఇచ్చామన్నారు. పాలకుర్తి నియోజకవర్గం నుండి 56,88 ఓట్ల మెజా రిటీ కడియం కావ్యకు ఇచ్చామన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నిక ల్లోను విజయం సాధించాలని పిలుపునిచ్చారు. పాలకుర్తి నియోజకవర్గం అభివృ ద్ధి పథంలో నిలిపేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామన్నారు. ఈ కార్య క్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు అనుమాండ్ల తిరుపతిరెడ్డి, హామ్యా నాయక్, ప్రవీణ్ రావు, సురేష్, పెదగాని సోమయ్య, అచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో కాంగ్రెస్‌కు 4508 అధిక్యం

లింగాలఘనపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి 4508 ఓట్లు మెజారిటితో ముందజతో కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీగా భారీ మెజార్టీ తో కడియం కావ్య గెలుపొందిన శుభ సందర్భంగా ఎంపీ కావ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మంగళవారం మండల కేంద్రంలో టపాకాయలు కాల్చి సీట్లు పం చుతూ సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనగామలో కిరణ్‌కుమార్ రెడ్డికి భారీ మెజార్టీ





నవతెలంగాణ-జనగామ

జనగామ నియోజకవర్గ ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీని అందించారు. జనగామ నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డికి 32,188 ఓట్ల ఆధిక్యం లభించింది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్, సిపిఎం అభ్యర్థులకు అత్యధిక ఓట్లు లభించాయి. మంగళవారం జరిగిన పార్లమెంట్ ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డికి 6,03,857 ఓట్లు, బిజెపి అభ్యర్థి బూర నర్స య్య గౌడ్‌కు 3,91,707 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశంకు 2,46,186 ఓట్లు, సీపీఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌కు 27,893 ఓట్లు లభించాయి.

జనగామ నియోజకవర్గంలో ఆయా పార్టీలకు ఓట్ల లభ్యత...

జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు లభించా యి. పార్టీల వారీగా చూసినప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 76,032 ఓట్లు, బిజె పి అభ్యర్థికి 44,797 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థికి 43,844 ఓట్లు రాగా, సిపిఎం అభ్యర్థి ఎండి జాంగిర్‌కు 2,686 ఓట్లు వచ్చాయి.జనగామ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి శ్యామల కిరణ్ కుమార్ రెడ్డికి 32,188 ఓట్ల ఆదిక్యం రావడం తో కాంగ్రెస్ శ్రేణులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. జనగామ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

మండల, గ్రామల ప్రజలకు అభినందనలు :

సీనియర్ నాయకులు జంగిటి విద్యనాథ్

బచ్చన్నపేట : మండలంలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి మండల సీనియర్ నాయకులు జంగిటి విద్యనాథ్ ధన్యవాదా లు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఎంతో కృషి చేశారని, మండలంలో అధ్యక్షుడు నూకల బాల్రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ మాసపేట రవీందర్ రెడ్డి, గ్రామాలలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి చామల కిరణ్ కుమార్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడానికి కష్టపడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

మండల ప్రజలకు కృతజ్ఞతలు : జిల్లా సందీప్

దేశానికి రాహుల్ గాంధీ, రాష్ట్రానికి రేవంత్ రెడ్డి కావాలనే ధృడ సంకల్పంతో కాంగ్రెస్ పార్టీకి జీవం పోసి మద్దతు తెలిపిన ప్రజలందరికీ మండల నాయకులు జిల్లా సందీప్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అఖండ మెజార్టీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక చౌరస్తాలో బాణసంచా కాల్చి పెద్ద ఎత్తున సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమం లో పట్టణాధ్యక్షుడు కోడూరు మహాత్మ చారి, నాయకులు నల్లగొండ బాల కిషన్ గౌడ్, మాజీ ఏఎంసి చైర్మన్ మాసాపేట రవీందర్ రెడ్డి, చెరుకూరు శ్రీనివాస్, వి విధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



చీటాకోడూర్ వాగు మీద బ్రిడ్జి నిర్మాణం...

కలగానే మిగులుతుందా..!

- నాయకుల చుట్టూ తిరుగుతున్న ప్రజలు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామ మండలంలోని 6 గ్రామాలతో పాటు రఘునాథపల్లి మండలంలోని 4 గ్రామాల ప్రజలకు ఆయా గ్రామాల నుండి జిల్లా కేంద్రమైన జనగామ పట్టణానికి చీటాకోడూర్ వాగు మీద నుండి రాకపోకలు సాగిస్తుంటారు. పూర్వకాలం నుండి ఈ ప్రయాణం కొనసాగుతున్నప్పటికీ వర్షాకాలంలో నానా ఇబ్బందులు పడుతున్నారు. చీటాకోడూర్ గ్రామస్తులతోపాటు చౌడారం, మరిగడి, రామచంద్రపురం, పత్తేషాపూర్, మాదారం, ఎర్రగుళ్లపహాడ్ తదితర గ్రామాలతో పాటు ఆయా గ్రామాల పరిసరాల్లోని గిరిజన తండాల ప్రజలందరూ ఈ వాగు పైనుండే రాకపోకలు జనగామ పట్టణానికి సాగిస్తుంటారు. అప్పుడెప్పుడో 40 సంవత్సరాల క్రితం వాగుపై లో-లెవెల్ వంతన నిర్మాణం జరిగి ఇప్పటివరకు ప్రజలకు సేవలందించింది. 2006లో చీటాకోడూరుర్-వడ్లకొండ గ్రామాల మధ్య దేవాదుల రెండవ దశ ఎత్తిపోతల పథకంలో భాగంగా 0.3 టిఎంసి సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మించారు. దీంతో వర్షాకాలంలో వాగుపై వరద ప్రవాహం కొంతమేరకు తగినప్పటికీ ఇటీవల కాలంలో రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడంతో పాటు భారీగా కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు చేరడంతో ఒక్కసారిగా గేట్లు ఎత్తివేయడంతో వరద ఉధృతికి మూడు, నాలుగు సంవత్సరాలుగా లో-లెవెల్ వంతెన పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వర్షాకాలంలోనే కాకుండా సాధారణ సమయంలో కూడా ప్రయాణించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత అధ్వాన పరిస్థితిలో ఉన్న వాగు మీద హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల యువకులు, ప్రజలు అంతా ఒక్కతాటి పైకి వచ్చారు. వాట్సప్ గ్రూపును తయారు చేసుకున్నారు. గ్రామాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులను కలిసి యువకులు, ప్రజలు అంతా ఏకమై వాగు మీద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కలిసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి కూడా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. కానీ ప్రభుత్వం నుండి ఆశించిన స్పందన రాలేదు.

నాయకులు ఏ మేరకు సహకరిస్తారో...?

చీటాకోడూర్ వాగు క్రమంగా దిగువకు ప్రవహిస్తూ యశ్వంతపూర్ మీదుగా నెల్లుట్ల నుండి దిగువకు దేవరుప్పుల మీదుగా ప్రవహిస్తూ కృష్ణ నదిలో కలుస్తుంది. చీటాకోడూర్ గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణం అత్యంత ఆవశ్యకమైన విషయమే. ఇది దాదాపు రెండు దశాబ్దాలుగా స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు శాసనసభ్యులకు, పార్లమెంటు సభ్యులకు కూడా విధితమే. మామూలు సమయాల్లో గ్రామాలకు రాకపోయినా ఎన్నికల సమయంలోనైనా ప్రజాప్రతినిధులు, శాసనకర్తలు ఈ వాగు మీదుగానే గ్రామాలకు వచ్చి పోతుంటారు. ఇంతకుముందు ఏమి జరిగిందో కానీ ఇప్పుడు మాత్రం ఆ వాగు మీదుగా ప్రయాణిస్తున్న గ్రామాల ప్రజలు, యువకులు ఒక్కతాటిపైకి వచ్చి డిమాండ్ చేస్తుండడం పట్ల ప్రజా ప్రతినిధులు నాయకులు ఏ మేరకు స్పందిస్తారో..? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్థానికంగా ఉన్న రాజకీయాలను పక్కనపెట్టి బ్రిడ్జి నిర్మాణం కోసం సహకరించినప్పుడే వారి రాజకీయ మనుగడకు కూడా సోపానంగా మారే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



అందరూ కదిలి రావాలి, సహకరించాలి :

యాసారపు కరుణాకర్, బ్రిడ్జి సాధన సమితి కన్వీనర్

వాగుపై బ్రిడ్జి నిర్మాణం అత్యంత ఆవశ్యకమైనది. నిత్యం ప్రయాణించే గ్రామాల ప్రజలందరూ కలిసి వచ్చి సహకరించాలి. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించినప్పుడే ప్రజలకు అవసరమైన బ్రిడ్జి నిర్మాణం సాధ్యమవుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు ముందుండి ఉద్యమాన్ని నడిపించాలి.

నిధులు మంజూరు చేయాలి :

రావుల రాజేష్ గౌడ్



పది గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్న చీటాకోడూర్ వాగు పై నిర్మాణ కోసం ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలి. ఈ మేరకు ప్రజలు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించగా ఆయన సానుకూలం గా స్పందించారు. ప్రభుత్వం కూడా అవసరమైన మేరకు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజల సహకారంతోనే నిర్మాణం :

చెరుకూరి మౌనిక



జనగామ మండలంతో పాటు రఘునాథపల్లి మండలంలోని పది గ్రామాల ప్రజల సహకారంతోనే వాగు మీద బ్రిడ్జి నిర్మాణ సాధ్యమవుతుంది. ప్రజలందరూ రాజకీయ నాయకులకు అతీతంగా సహకరించాలి. పార్టీలకు అతీతంగా ఉద్యమంగా పోరాటం చేయాలి. స్థానిక శాసన సభ్యులతో పాటు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక అధికా రులు అందరూ సహకరించాలి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మహబూబాబాద్
బుధవారం | జూన్ 5, 2024 | www.navatelangana.com

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ భూస్థాపితం

- మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షాలు ఉపాధి ఉద్యోగాలను గాలికి వదిలి అందిన కాడికి దండుకున్న బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు పార్లమెంటు లోక్‌సభ ఎన్నికల్లో భూస్థాపితం చేయబోతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కొరవి మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయాన్ని మంత్రి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. దేవాలయ అధికారులు, అర్చకులు ప్రత్యేకంగా స్వాగతం పలికి సన్మానం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ ప్రజలు కేసీఆర్ కుటుంబానికి గుణపాఠం చెప్పారని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తప్ప ఎవరికి ఏమి ఒరిగింది లేదని అన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి కరువు కాల్చి వాత పెట్టబోతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా బీఆర్ఎస్‌కి వచ్చే అవకాశం లేదని ఎద్దేవా చేశారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు. మహబూబాబాద్‌లో డీసీసీ కార్యాలయంలో ఎంపీ కౌంటింగ్ సరళిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్, డీసీసీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి పాల్గొన్నారు.





కౌంటింగ్ సెంటర్లో కనీస సౌకర్యాలు కరువు

- డీపీఆర్‌వోతో జర్నలిస్టుల వాగ్వావాదం
- ఎస్పీ జోక్యంతో సద్దుమణిగిన వివాదం

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ లోక్‌సభ ఓట్ల లెక్కింపు కేంద్రంలోని మీడియా సెంటర్‌లో కనీస సౌకర్యాలు లేక జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటల నుంచి పది గంటల వరకు మీడియా సెంటర్‌లో కరెంటు లేదు. మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు. ఏడు నియోజకవర్గాల సంబంధించిన భవనాల్లో కరెంటు ఉన్నప్పటికీ కేవలం జర్నలిస్టులకు మీడియా సెంటర్ ఏర్పాటు చేసిన భవనంలోనే కరెంటు లేకుండా పోయింది.కరెంటు లేకపోవడంతో సమాచారం అందించే టీవీ స్క్రీన్ పనిచేయలేదు. ఫ్యాన్లు కూలర్లు తిరగక పోవడంతో ఉక్కపోతతో జర్నలిస్టులు అతలాకుతలమయ్యారు. టిఫిన్, తాగు నీరు సౌకర్యం కూడా లేకపోవడంతో జర్నలిస్టు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అంతేగాక రౌండ్ల వారీగా జర్నలిస్టులకు అధికార యంత్రాంగం ఫలితాలు ఇవ్వలేదు. 10 గంటలు దాటిన ఒక్క ఫలితం కూడా వెలువడ లేదు.మూడు రౌండ్ల కౌంటింగ్ అయిపోతున్నప్పటికీ ఫలితాలు ఇవ్వకపోవడంతో జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫోటోలు తీసుకోవడానికి ఫోటోగ్రాఫర్లను కూడా కౌంటింగ్ వద్దకు అనుమతించలేదు. డిపిఆర్ఓ అందుబాటులో లేకుండా పోవడంతోజర్నలిస్టు తీవ్ర నిరసన వ్యక్తం చేసి ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న పోలీసు అధికార యంత్రాంగంతో వాగ్వావాదం చేయగా వారు డిపిఆర్ఓ ప్రేమలతను పిలిపించారు. కౌంటింగ్‌కు చెందిన ఎలాంటి సమాచారం తనకు లేదని తనకు సమాచారం వస్తేనే విలేకరులకు ఇస్తానని స్పష్టం చేశారు.ఒకానొక సందర్భంలో కలెక్టర్ పూర్తిగా అన్ని రౌండ్స్ అయిపోయిన తర్వాత ఫైనల్ రిజల్ట్ మాత్రమే పాత్రికేయులకు సమాచారం ఇస్తారని విషయం బయటకు పొక్కడంతో జర్నలిస్టులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా 16 స్థానాల ఫలితాలు టీవీలలో వస్తున్నాయని ఒక మహబూబాబాద్ ఫలితం మాత్రమే ఏది అందడం లేదని నిరసన వ్యక్తం చేశారు. ఎస్పీ, కలెక్టర్ రావాలని డిపిఆర్ఓను డిమాండ్ చేశారు. దాంతో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ పాత్రికేయుల వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఫోటోగ్రాఫర్లను డిపిఆర్ఓకు అనుసంధానం చేసి ఒక ఎస్సై సాయి అధికారి నుంచి లోనికి అనుమతించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రెండు గంటల అనంతరం మీడియా సెంటర్లో విద్యుత్ మరమత్తు పనులు పూర్తి చేసి కరెంటు సౌకర్యం కల్పించారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-మహబూబాబాద్



మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థి వరికోలు సాయి చరణ్ గత నెల 15న వరంగల్‌లో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడగా చికిత్స కొరకు టీపీటీఎఫ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో 30 వేల ఆర్థిక సాయం పాఠశాల ప్రిన్సిపల్ అనితకు అందజేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీశైలం మాట్లాడుతూ వరంగల్ లోని అపోలోరీచ్, ఎన్ఎస్ఆర్ హాస్పిటల్స్‌లో విద్యార్థి చికిత్స కోసం ఇప్పటి వరకు ఎనిమిది లక్షలు ఖర్చు చేశారని, పాఠశాల ఉపాధ్యాయులు హరీష్ ద్వారా విషయం తెలుసుకొని మా వంతు బాధ్యతగా ఈ ఆర్థిక సహాయం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిద్ధోజు కవిత, జిల్లా నాయకులు సోమ విష్ణువర్ధన్, బలాష్టి రమేష్, మహబూబాబాద్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాచకొండ ఉపేందర్, సజ్జనము పాల్గొన్నారు.



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి


- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామయ్య

నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 60 లక్షల మంది కార్మిక వర్గం పని చేస్తుందని వారి వేతనాలలో తీవ్రమైన వ్యత్యాసాలు కలవని సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టియు) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామయ్య అన్నారు. మహబూబాబాద్‌లో ఐఎఫ్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశాలు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అధ్యక్షతన జరిగిగాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన రామయ్య మాట్లాడుతూ 76 కనీస వేతనాలు జీవోలు రాష్ట్రంలో అమలవుతున్న వేతనాల కంటే తక్కువ వేతనాలను నిర్ణయించి గెజిట్ విడుదల చేయటం దుర్మార్గం అని అన్నారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు, ఇతర అవసరాల కోసం చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న కార్మికవర్గానికి ఉన్న వేతనాలను పెంచకుండా తక్కువ వేతనాల గెజిట్ విడుదల చేయటం కార్మిక వర్గపు శ్రమ శక్తిని దోచుకోవడంలో భాగమేనని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఆ జీవోలను సవరించి కనీస వేతనం రూ. 26 వేలు ఉండేటట్లుగా గెజిట్ విడుదల చేయాలని రామయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఇఫ్టు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిళ్ళ కంటి సూర్యంతో పాటు జిల్లా సహాయ కార్యదర్శి కె.భాస్కర్ రెడ్డి, జిల్లా కోశాధికారి కే.సంపత్, జిల్లానాయకులు శ్రీరాం పుల్లయ్య, ఎండి మౌలానా, మంగళపల్లి ప్రసాద్, లచ్చయ్య చింతా నవీన్ పాల్గొన్నారు.

విద్యుత్ ఘాతంతో పాడి గేదె మృతి

నవతెలంగాణ-గార్ల



ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని రాంపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం రామసాని వీరారెడ్డికి చెందిన పాడి గేదె గ్రామం సమీపంలోని చింత కుంట చెరువు సమీపంలో రోజు లాగానే గడ్డి మేసేందుకు వెళ్లిందని చెరువు సమీపంలో విద్యుత్ తీగలు ఆదివారం కురిసిన అకాల వర్షం, గాలి దుమారంతో విద్యుత్ తీగలు తెగిపడి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో చనిపోయిందని వాపోయారు. గేదె విలువ సుమారు 70 వేల రూపాయలు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-చిన్నగూడూరు

మండల కేంద్రంలోని మంగళవారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పక్క సమాచారంతో పోలీసులు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై ఝాన్సీ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

మానుకోట ప్రజలకు రుణపడి ఉంటా

- ఉపాధి కోసం ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు కృషి
- అన్ని గ్యారెంటీలు అమలు చేస్తాం
- విజేత బలరాం నాయక్

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ పార్లమెంటు స్థానంలో తనను రెండోసారి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని ప్రజలకు ఉపాధి కల్పించే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం కృషి చేస్తానని గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ కౌంటింగ్ కేంద్రంలో గెలిచిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ సంఘం ఏర్పడిన తొలిసారి తనను గెలిపించాలని మధ్యలో పది సంవత్సరాలు గ్యాప్ వచ్చిందని, మళ్లీ రెండోసారి తనని గెలిపించిన ప్రజలకు కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు, ఎమ్మెల్యేలకు రుణపడి ఉంటానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన అన్ని గ్యారెంటీలను అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మానుకోట నియోజకవర్గాన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన జీవితాశయం అని అన్నారు. భవిష్యత్తులో మొండివాగు, పర్ణశాల బ్రిడ్జిలు కట్టించాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్రీయ విద్యాలయాలు, మోడల్ స్కూల్స్ అప్ గ్రేడ్ చేయవలసి ఉందన్నారు. ఈ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం అదనపు రైళ్ల హాల్టింగ్‌కు కృషి చేస్తానని అన్నారు. గతంలో నేను చేయలేకపోయానని 10 సంవత్సరాల గ్యాప్ వచ్చిందని ఇప్పుడు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు.

అసెంబ్లీతో పోల్చితే స్వల్పంగా తగ్గిన మెజార్టీ

మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 22 రౌండ్లలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుదీర్ రామనాథ కేకన్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బలరాం నాయక్ ఓట్ల కౌంటింగ్ కేంద్రంలోనే ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత మూడవ రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. మూడో పార్టీగా బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ నిలిచారు. కౌంటింగ్ నిర్వహించిన 22 రౌండ్లో మొదటి నుంచి లాస్ట్‌వరకు కాంగ్రెస్ అభ్యర్థి ఆధిపత్యం కనపరిచారు.ఏఒక్క రౌండ్‌లోను బీఆర్ఎస్ అభ్యర్థికి ఆధిక్యత రాలేదు. బిజెపి అభ్యర్థి దరిదాపుల్లో కూడా లేరు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిక్యత స్వల్పంగా తగ్గింది. డోర్నకల్‌లో అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే డాక్టర్ తేజవత్ రామచంద్రనాయక్‌కు 53,131 ఓట్ల మెజార్టీ రాగా అదే డోర్నకల్ నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌కు 47,528 ఓట్ల మెజారిటీ రాగా 5603 ఓట్ల మెజారిటీ తగ్గింది. అలాగే మహబూబాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ 51 వేల 153 ఓట్ల మెజార్టీ రాగా బలరాం నాయక్ 49883 ఓట్ల మెజారిటీ సాధించారు. ఇక్కడ 1270 ఓట్ల మెజారిటీ తగ్గింది.

కట్టుదిట్టమైన భద్రత మధ్య కౌంటింగ్

మహబూబాబాద్‌లో ఓట్ల కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు చేసిన ఏర్పాట్లు అతిగా అనిపించాయి. మహబూబాబాద్ లోక్‌సభ ఓట్ల కౌంటింగ్ కేంద్రానికి పోలీస్ యంత్రాంగం 6 అంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆధ్వర్యంలో పోలీస్‌లు అడుగడుగునా మోహరించి బాంబ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీ అనంతరం పాత్రికేయులను లోనికి అనుమతించారు. లోక్‌సభ ఓట్ల కౌంటింగ్ ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు అనుసంధానంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కూడా ఆధీనంలోకి తీసుకున్నారు. గతంలో నేరుగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అనుమతించేవారు. కానీ ఈసారి ప్రవేశ దారాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మార్చారు. పాత్రికేయులు, ఏజెంట్లు, అభ్యర్థులు, అధికారులు అందరూ దూరంలో ఉన్న డిగ్రీ కళాశాల ప్రవేశ ద్వారం నుంచి వచ్చి పోయేలా ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న అభ్యర్థుల వాహనాలను కూడా లోనికి అనుమతించలేదు. పాత్రికేయులకు ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ వరకు మూడు అంచల భద్రతను, కౌంటింగ్ నిర్వహించే హాలుకు ఆరు అంచల భద్రతను ఏర్పాటు చేశారు. సుమారు 300 మంది పోలీసు బలగాలు మోహరించినట్లు సమాచారం. జిల్లాలో ఉన్న సిఆర్‌పిఎఫ్, ఎస్పీ ప్రత్యేక పోలీస్ విభాగం, లా అండ్ ఆర్డర్, హోంగార్డు, ట్రాఫిక్, మహిళా, స్పెషల్ బ్రాంచ్, ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్, ఐటీ కోర్, సిసిఎస్, బాంబు స్క్వాడ్, పోలీస్ విభాగాలన్నీ కౌంటింగ్ వద్ద మొహరించాయి. అంతేకాక నర్సంపేట, ములుగు, ఇల్లందు, భద్రాచలం, పినపాక ప్రాంతాలకు చెందిన ముఖ్యమైన పోలీస్ యంత్రాంగం కూడా కౌంటింగ్ కేంద్రం వద్ద మొహరించారు. నాలుగు అంచెల భద్రత దాటిన తర్వాత సెల్ ఫోన్లు నిరాకరించారు. కౌంటింగ్ కేంద్రంలోనికి ఎవరి ఫోన్లను అనుమతించలేదు. కౌంటింగ్ వద్ద పోలీసులు చేసిన ఏర్పాటు కొద్దిగా అతిగా అనిపించాయి.

గులాబీల ఆశలు గల్లంతు... మూడో రౌండ్‌లో వెనుతిరిగిన కవిత

మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎంతో కొంత మెజారిటీతో తాము గెలుస్తామని ఎంతో ధీమాగా ఉన్నా గులాబీ శ్రేణులు ఆశలు గల్లంతయ్యాయి. ప్రజానీకం సర్వేలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత అన్ని వర్గాల ప్రజలకు చేదోడువాదోడుగా ఉంటారని... అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోతారని... ఆపదలో ఉన్న వారికి ఆపద్బాంధవురాలిగా ప్రత్యక్షమవుతారని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారు. అదే క్రమంలో బలరాంనాయక్ అందుబాటులో ఉండరని, కార్యకర్తలతో ప్రత్యక్షంగా అనుబంధాలు, సంబంధాలు లేవని ఎలాగైనా కవిత గెలుస్తారని పింకీలు ఆశపడ్డారు. అయితే వారి ఆశలు గల్లంతై మొదటి రౌండు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ మెజార్టీతో దూసుకుపోయారు. మూడో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ 51,793 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీంతో బీఆర్ఎస్ ఆశలు పూర్తిగా సన్నగిల్లిపోయాయి. అంతేగాక మానుకోట పార్లమెంట్ పరిధిలోని మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, ఇల్లందు, భద్రాచలం, పినపాక అన్ని ఈవీఎంలలో కూడా కాంగ్రెస్ మెజారిటీ కనిపించింది. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి కవిత ఓట్ల లెక్కింపు కేంద్రం నుంచి బయటికి వచ్చారు. పాత్రికేయులు మాట్లాడాలని కోరినప్పటికీ దాటవేస్తూ బయటికి వెళ్లిపోయారు. మరోపక్క కోట్ల లెక్కింపు జరుగుతుండగానే బీఆర్ఎస్ నాయకులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి ఇంటి బాట పట్టారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల నుంచి బయటికి వచ్చిన కవిత కౌంటింగ్ తాను ఒక్కతే కారు ఎక్కి వెళ్లిపోయారు. కవిత వెంట బీఆర్ఎస్ నాయకులు పరకాల శ్రీనివాస్ రెడ్డి, గుడిపూడి నవీన్ రావు బయటికి వచ్చారు.

కాంగ్రెస్ కంచుకోటగా డోర్నకల్... డోర్నకల్ నుంచి 45వేల మెజార్టీ

మరిపెడ : డోర్నకల్ నియోజకవర్గం మరోమారు కాంగ్రెస్ కంచుకోటగా నిరూపితమైంది. గడచిన 60ఏళ్లుగా ఈ ప్రాంతంలో రెండు దఫాలు మినహా మిగతా అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే ఆధిపత్యం. అయితే 2014లో జరిగిన ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కాంగ్రెస్ నుంచి గెలుపొంది 2015లో బీఆర్ఎస్‌లో చేరగా.. 2018లో బీఆర్ఎస్ బీఫాం నుంచి గెలుపొందారు. అదే విధంగా 2009లో మహాకూటమి నుంచి సత్యవతి రాథోడ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ రెండు దఫాలు మినహా డోర్నకల్ నుంచి ఏ ఎన్నికల్లో మిగతా పార్టీలకు ప్రజానీకం చోటివ్వలేదు. అదే కోవలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో సైతం డోర్నకల్ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌కు బంపర్ మెజార్టీ ఇచ్చారు. మంగళవారం విడుదల చేసిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో మానుకోట పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ 3,49,165ఓట్ల మెజార్టీతో గెలుపొందగా, అందులో డోర్నకల్ ప్రజానీకం 96,505ఓట్లతో మద్దతు పలికింది. ఫలితంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితపై డోర్నకల్ నుంచి బలరాం నాయక్‌కు 45వేల లీడ్ వచ్చింది. దీంతో మరోమారు డోర్నకల్ ఓటర్లు హస్తానికి తమ పూర్తి సమ్మతం తెలిపారు.

మొదటి నుంచే స్పష్టమైన మెజార్టీ...

మానుకోట పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా మొత్తం 15,32,366 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. మే 13న జరిగిన లోక్‌సభ 4వ విడత పోలింగ్‌లో 11,01,030 ఓట్లు పోలైయ్యాయి. నేడు విడుదల చేసిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో పోస్టల్ బ్యాలట్ ఓట్లతో కలుపుకుని కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కు 6,12,774ఓట్లు రాగా, సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు 2,63,609ఓట్లతో రెండవ స్థానంలో, బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్‌కు 1,10,444ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి 3,46,089ఓట్లతో బీఆర్ఎస్ అభ్యర్థి కవితపై మహబూబాబాద్ పార్లమెంట్ నియోజవకర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందారు.

డోర్నకల్లో కాంగ్రెస్ హవా..

డోర్నకల్ నియోజకవర్గంలోని 2,22,906 లక్షల ఓట్లుండగా మే 13న జరిగిన పోలింగ్‌లో 1,68,053వేల ఓట్లు పోలైయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల విడుదల అనంతరం డోర్నకల్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి 94,673, బీఆర్ఎస్ అభ్యర్థి 50,293, బీజేపీకి 9,884 ఓట్లు పోలైయ్యాయి. దీంతో బలరాం నాయక్ డోర్నకల్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి మాలోత్ కవితపై 45వేల ఓట్ల లీడ్ సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎంపీ కవిత తండి మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పై డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ 53,133 ఓట్ల మెజార్టీతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక మెజార్టీ సాధించగా, ప్రస్తుతం బలరాం నాయక్ కవితపై 44వేల ఓట్ల పైచిలుకు మెజార్టీ సాధించటంతో డోర్నకల్ మరోమారు కాంగ్రెస్ కంచుకోటగా నిరూపించుకుంది. అసెంబ్లీతో పోల్చుకుంటే డోర్నకల్‌లో 9వేలకు పైగా మెజార్టీ కాంగ్రెస్‌కు తగ్గింది. అయితే పోలింగ్ శాతం నియోజకవర్గంలో తగ్గినా కాంగ్రెస్ మెజార్టీ కొనసాగించటం ఆ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

పోలింగ్ కేంద్రం మధ్యలోనే వెళ్లిన కవిత...

కౌంటింగ్ ప్రారంభమైన తొలి రౌండ్ నుంచే కాంగ్రెస్ స్పష్టమైన మెజార్టీ సాధించటంతో 6వ రౌండు ముగిసే సమయానికి బీఆర్ఎస్ అభ్యర్థి కౌంటింగ్ కేంద్రాన్ని వదిలి వెళ్లారు. రాష్ట్రంలో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఎక్కడ కూడా తన ప్రభావం చూపలేక పోయింది. అదే విధంగా మానుకోటలోనూ బీఆర్ఎస్ పార్టీని ప్రజలు విశ్వసించలేదు. దీంతో మాలోత్ కవితకు భారీ ఓటమి తప్పలేదు. గత ఎన్నికల్లో మొత్తం 4.64లక్షల ఓటింగ్ మాలోత్ కవిత సాధించగా ఈ సారి మాత్రం 2,62,416 ఓట్లకే పరిమితమయ్యారు. దీంతో సగానికి పైగా ఓట్లు కాంగ్రెస్ తన కైవసం చేసుకుని గత ఎన్నికల్లో మాలోత్ కవిత 1.23లక్షల ఓట్ల లీడ్‌ను కలుపుకుని మొత్తం 3.45లక్షల లీడ్‌బలరాం నాయక్ విజయం సాధించారు. సీఎం రేవంత్ రెడ్డి మార్క్, కమ్యూనిస్టుల మద్దతు, కుల సంఘాల మద్దతుతో కాంగ్రెస్ బలమైన ఓటు బ్యాంకును కలిగి ఫలితాల్లో గెలుపొందింది.

సీతారాం ఇమేజ్‌తో బీజేపీకి పెరిగిన గ్రాఫ్...

మొదటి నుంచి బీజేపీకి అంతగా స్కోప్ లేని ప్రాంతం మానుకోట పార్లమెంట్ నియోజకవర్గం. అయితే దేశంలో బీజేపీ మంచి పట్టు కలిగి ఉండటం, దీనికి తోడు ప్రొఫెసర్ సీతారం నాయక్‌కు బీజేపీ టికెట్ కేటాయించటంతో ఆయన సొంత ఇమేజ్‌తో గత ఎన్నికల్లో 6 శాతం ఉన్న బీజేపీ ఓటింగ్, ఈ ఎన్నికల్లో 10 శాతానికి పెరిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీ 1,08,775 ఓట్లు సాధించింది. గత ఎన్నికల్లో బీజేపీ కేవలం 40వేల ఓట్లకే పరిమితవగా ఈ సారి మాత్రం సీతారాం నాయక్ ఎంట్రీతో లక్ష ఓటు బ్యాంకును పొందుపర్చుకుంది.

ఉపాధి హామీకి నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-బయ్యారం



ఉపాధి హామీ పథకానికి తగినన్ని నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని మంగళవారం ఉపాధి కార్మికుల పని దగ్గర ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అఖిల భారత రైతు కులీ సంఘం మండలాధ్యక్షులు రామగిరి బిక్షం, పివైఎల్ జిల్లా అధ్యక్షులు తుడుం వీరభద్రం మాట్లాడుతూ వలస కూలీలను నివారించే లక్ష్యంతో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం గత యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని, కానీ పాలకులు ఈ పథకానికి అవసరమైన నిధులు కేటాయించకుండా ఏటేటా నిధులలో కోత విధించి నిర్వీర్య పరుస్తూ క్రమంగా ఈ పథకాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారు విమర్శించారు. కొత్తగా పని అడిగిన వారికి జాబ్ కార్డులు ఇవ్వకుండా ఉన్నవారిని తీసివేస్తున్నా రని, చేసిన పనికి బిల్లులు చెల్లింపులలో వారాల తరబడి నెలల తరబడి తీ వ్రంగా జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులో ఆధార్ కార్డు లింక్ చేయడం సైట్ ఓపెన్ కావడం లేదని సాకుతో కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వారానికి ఒకసారి బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించాలని, పని ప్రాంతంలో గడ్డపారులు, పారలు, టెంటు, మెడికల్ కిట్టు సౌకర్యాలు, పని ప్రదేశం దూరమైతే చార్జి అదనంగా ఇవ్వాలని, మెట్లకు గౌరవ వేతనం యివ్వాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు తగిన కేటాయింపులు సౌకర్యాలు సాధించుకునేందుకు ఉపాధి కార్మికులు నేడు జరిగే ధర్నాలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతకాని రాకేష్, కొదుమూరి నాగేశ్వ రావు, శేషు తదితరులు పాల్గొన్నారు.

బలరాం నాయక్ గెలుపుతో సంబరాలు

నవతెలంగాణ-బయ్యారం

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ భారీ మెజార్టీతో గెలవడంపై సంతోషం వ్యక్తం చేస్తూ మంగళవారం మండల పరిధిలోని కొత్తపేట, గంధంపల్లి బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కారుపోతుల రామ్మూర్తి, కడియాల, మాజీ సర్పంచ్ గూగుత్ శ్రీను, వెంకటరామయ్య, బొమ్మకంటి రాంబాబు, మాతంగి ఉపేందర్, కృష్ణ, రాందాస్, గణేష్, బాలరాజు, గట్టు శ్రీను, పుల్లయ్య, రాజు, అనిల్, శివ పాల్గొన్నారు.

ఇనుగుర్తి : మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ నాయకులు బాణాకాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలు ప్రజలు నమ్మి మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావాలని ఎంపీ బలరాం నాయక్‌ను ప్రజలు అందరూ కలిసి అధిక మెజార్టీతో గెలిపించారన్నారు. ఈ వేడుకలలో జిల్లా, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గూడూరు : మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిట్టే వెంకన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్టే వెంకన్న, జిల్లా నాయకులు మధు, కొమ్మాలు, రాజేందర్ పాల్గొన్నారు.

గూడూరు : మండలంలోని బ్రాహ్మణపల్లి కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు బుడిగ సతీష్ నేతృత్వంలో ఎంపీ బలరాం నాయక్ గెలుపు పట్ల సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెరుగు మధు, భూపతి శ్రీను, రమేష్, దొనికల కుమారస్వామి, గోపగాని రవి, బొల్లి సారయ్య, బత్తుల వివేక్, సురేష్, మహమ్మద్‌అలీ, యాకచారి, మునేందర్, బాలు, వీరన్న, సోమ్లా, మోహన్, కారింగుల శ్రీను, ముల్కపురి సురేష్, గుర్రం ప్రభాకర్, రవి, బ్రాహ్మణపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లికుదురు : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బలరాం నాయక్ భారీ మెజార్టీతో గెలవడం పట్ల మండల వైస్ ఎంపీపీ జిల్లా వెంకటేష్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బండి శ్రీను, కొంపల్లి శ్రీశైలం యాదవ్, మద్దిరాజు కిషన్, జగదీష్, సుధీర్, పెరుమాండ్ల శంకర్, అశోక్, భాస్కర్, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డితోనే అభివృద్ధి : యాదవరెడ్డి

సీఎం రేవంత్ రెడ్డితోనే తెలంగాణ సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదల యాదవ రెడ్డి, మాజీ జెడ్పిటిసి హెచ్.వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంకర అయ్యప్ప రెడ్డి అన్నారు. పోరిక బలరాం నాయక్ భారీ మెజార్టీతో గెలిపించడం పట్ల హర్ష వ్యక్తం చేస్తూ టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నపురం యాకయ్య, పులి వెంకన్న, కుమ్మరికుంట్ల మౌనేందర్, వరిపల్లి పూర్ణచందర్, మహమ్మద్ మౌలానా, మల్లేష్, పిట్టల మురళి, గుండ్లపల్లి యాకన్న, వెన్నం క్రాంతిరెడ్డి, కిషన్‌నాయక్, నరసయ్య కొమురెల్లి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గార్ల : పోరిక బలరాం నాయక్ గెలుపును హర్షిస్తూ స్థానిక నెహ్రూ సెంటర్‌లో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసి జాటోత్ ఝాన్సీలక్ష్మీ, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు గుండా వెంకట రెడ్డి, టి.కృష్ణ గౌడ్, కె.రామకృష్ణ, షంషాద్ బేగం, బి.హతిరాం, ఎ.వెంకటేశ్వర్లు, యాకూబ్ పాష, పఠాన్, జె.వెంకన్న, పి.నరసింహారావు, కందునూరి శ్రీనివాస్, నాగరాజు, ఐలేష్ పాల్గొన్నారు.

రామారావు అభినందనలు...

పోరిక బలరాం నాయక్ గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు, శ్రేణులు, ఓటర్లు అందరికీ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ధనియాకుల రామారావు కృతజ్ఞతలుతెలిపారు. బలరాం నాయక్‌ను కలిసి రామారావు శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నాయకత్వంలో మండలంలో మొత్తం 21,603 ఓట్లు నమోదు కాగా కాంగ్రెస్ అభ్యర్థికి నియోజకవర్గంలోనే మండలంలో అత్యధికంగా 14,306 ఓట్లు నమోదు అయ్యాయని అత్యధిక మెజార్టీ కట్టబెట్టిన కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం శ్రేణులకు, మండల ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నగూడూరు : బలరాం నాయక్ భారీ విజయం సాధించడంపై ఆ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. కేంద్రంలోని దశరథ సెంటర్‌లో గ్రామ అధ్యక్షులు బత్తెం రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న, సీనియర్ నాయకులు రంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నాగేష్, గంగరబోయిన శ్రీను, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు జహంగీర్ పాషా, కోఆప్షన్ సభ్యులు మోసిన్, గాడి పెళ్లి అనిల్, శేఖర్, నిరంజన్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో టీడీపీ సంబరాలు

నవతెలంగాణ-మహబూబాబాద్

నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఎన్‌డీఏ ఫ్రెంట్ ఘనం విజయం సాధించినందుకు టీడీపీ మహబూబాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు కోండపల్లి రామచందర్ రావు ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ కార్యాలయం ముందు ఘనంగా వేడుకలు నిర్వహించారు. చంద్రబాబు నాయుడి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి బాణసంచాలు కాల్చి, మిఠాయిలు పంచారు. ఈకార్యక్రమంలో నవీన్ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి, కోండపల్లి రామచంద్రమ్మ ఎంపీటీసీ రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి, రాజేశ్ టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు ఇర్గు రవి, ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షులు బాలు నాయక్, మండల ఎస్టీ సెల్ నాయకులు బద్రు, చంద్రబాబు అభిమానులు కట్ల వెంకన్న, రంగారెడ్డి, నర్సురెడ్డి, ఎడ్ల శ్రీను, సింగం మురళి, అనూష, ఆదిత్య, సాయి, కోటి, రాము, ఉపేందర్, వెంకన్న, మల్సూర్‌లు పాల్గొన్నారు.

తొర్రూరు : ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలోకి రావడంతో తొర్రూర్ మండల కేంద్రంలోని మండల పార్టీ అధ్యక్షుడు భోగా భాస్కర్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దవంగర మండల పార్టీ అధ్యక్షుడు బాయన బిక్షపతి, నియోజకవర్గ సమన్వయకర్త సముద్రాల సోమన్న, వరంగల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి చిత్తరంజన్, మాజీ ఎంపీటీసీ వాల్య కుమారస్వామి, సీనియర్ నాయకులు సోమ వీరన్న, తాటిశెట్టి శ్రీనివాస్, వెంకన్న, బత్తుల మారేశ్రావ్, పోతురాజు యాకేందర్, మహేందర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవంగర : ఆంధ్రప్రదేశ్‌లో జగన్ చెత్త పాలన పోయి చంద్రన్న పాలన వచ్చిందని టీడీపీ మండలాధ్యక్షుడు బైన బిక్షపతి అన్నారు. 2024 ఎన్నికల్లో ఏపీలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం మండల కేంద్రంలో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమ వీరన్న, తాడిశెట్టి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పాశం యాకయ్య, బైన మనోజ్ సాగర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పెద్ది అనిల్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-గూడూరు

దేశంలో బిజెపి అధికారంలోకి రావడంతో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బిజెపి నాయకులు ప్రధాన కూడలి వద్ద సంబరాలు నిర్వహించారు. బాణసంచ పేల్చి స్వీట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు చెల్పూరు వెంకన్న, మీ రెడ్డి సురేందర్, సమ్మెట సుధాకర్, నాగరాజు, రాజు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కడియం కావ్య గెలుపుతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నవతెలంగాణ-చిట్యాల



వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య వారి మెజారిటీతో గెలు పొందడంతో మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి సత్యం ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కషి చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపి కడియం కావ్యకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొక్కుల సదానందం, గంగాధరి రవీందర్, చిలుముల రాజమౌళి, బుర్ర మల్లేష్,ఆకుల ఆదిరెడ్డి, ఆకుల రవీందర్,సర్వ శరత్, యూత్ టౌన్ అధ్యక్షులు అల్లం రాజు ఉయ్యాల రమేష్ ఈగ కోటేశ్వర్, నాసర్ కొత్తూరు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

నవతెలంగాణ-ఏటూరునాగారం (ఐటీడీఏ)



ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకన్న, చిటమట రఘు మాటాడుతూ కాంగ్రెస్ పార్టీపై ఉన్న నమ్మకంతో ప్రజలు పట్టం కట్టారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ రుణపడి ఉంటుందన్నారు. ప్రభుత్వం అందజేసే అభివద్ధి పథకాలను అన్ని వర్గాల ప్రజలకు చేరవేసేందుకు ప్రభుత్వం అహర్నిశలు కషి చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు ఆయూబ్, గంపల శివ, రంజిత్, వావిలాల ఎల్లయ్య, సర్దార్‌పాషా, గౌస్, ముత్తయ్య, రమేష్, శ్రీను, హన్మంతు, లక్కి తదితరులు పాల్గొన్నారు.



గాలివాన బీభత్సం

విరిగిన విద్యుత్ స్తంభాలు

అంధకారంగా మారిన గ్రామాలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల గాలీవాన బీభత్సంతో మండలంలోని తాడిచెర్ల, మల్లారం, కొయ్యుర్, పెద్దతూండ్ల గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయి, కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో మండలంలోని పలు గ్రామాలు అందకారంగా మారాయి. మల్లారం,చిన్నతూండ్ల గ్రామాల్లో పలు రేకుల ఇండ్లు ధ్వంసమై రేకులు కొట్టుకుపోయాయి. తాడిచెర్ల కొయ్యుర్ ప్రధాన రహదారిపై తాటి,వేప చెట్లు విరిగి పడటంతో రవాణాకు ఆటంకం కలిగింది. కొయ్యుర్, వల్లెంకుంట, రుద్రారం, తాడిచెర్ల, మల్లారం గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఏసీఎస్, డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించడానికి పోసిన ధాన్యం కుప్పలు మళ్లీ తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులకు, ప్రజలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. అకాల గాలివాన బీభత్సంతో ఇండ్లు, పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను, ప్రజలకు ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళం

నవతెలంగాణ-మహదేవపూర్

మండలంలోని కాళేశ్వరంలోని హనుమాన్ టెంపుల్ అభివృద్ధి కోసం కాటారం దక్కన్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గుండేటి లీలేస్ రూ.50వేల విరాళాన్ని మంగళవారం ఆలయ అర్చకులు మాడుగుల బాపుశర్మకు అందజేశారు. ఆలయ అభివద్ధి కోసం విరాళం ఇచ్చినందుకు బ్యాంకు మేనేజర్‌కు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

వరంగల్ తూర్పు, పశ్చిమలో కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి పోటీ

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య కు బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్ గట్టి పోటీని ఇచ్చారు.ఒకటో రౌండ్ లో పార్ల మెంట్ బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్ కు 5282 ఓట్లు, పార్ల మెంట్ అభ్యర్థి కడియం కావ్యకు 3302 ఓట్లు, రెండో రౌండ్ లో ఆరూరి రమేష్ కు 37 94 ఓట్లు, కడియం కావ్యతో 5335 ఓట్లు, మూడవ రౌండ్ లో ఆరూరి రమేష్ 2866 ఓట్లు, కడియం కావ్య కు 5896, నాలుగో రౌండ్లో అరురికి 4913, కడియం కావ్య కు 2875,ఐదవ రౌండ్ అరురికి 4150, కడియం కావ్య కు 3192,ఆరవ రౌండ్ ఆరూరికి 4999, కడియం కావ్య కు 4641,ఏడవ రౌండ్ ఆరురికి 3829, కడియం కావ్య 4269,ఎనిమిదో రౌండ్ ఆరూరి కి 5568, కడియం కావ్య కు 2822, 9వ రౌండ్ ఆరురికి 5510, కడియం కావ్య కు 3379, పదవ రౌండ్లో ఆరూరి కి 4228, కడియం కావ్యకు 3821,11వ రౌండ్ ఆరూరికి 3665, కడియం కావ్య కు 5196,12 రౌండ్ ఆరూరికి 3665, కడియం కావ్య కు 5196,13వ రౌండ్ ఆరూరికే 6008, కడియం కు 3566, 14 రౌండ్ అరురికి 5620, కావ్యకు 3403,15వ రౌండ్ అరురికి 4481, కావ్యకు 4343,16 వ రౌండ్ అరురికి 3926, కావ్యకు 4918,17 వ రౌండ్ అరురికి 1952, కావ్యకు 1674 లు ఓట్లు వచ్చాయి. కొన్ని రౌండ్లలో కాంగ్రెస్ ఎక్కువ వచ్చినప్పటికీ మొత్తం రౌండ్లను పరిశీలించినట్లయితే కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి పోటీలు ఇచ్చింది.

పశ్చిమలో నియోజకవర్గంలో..

వరంగల్ వెస్ట్ లో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య భారీ మెజారిటీతో గెలిచినప్పటికీ వరంగల్ పశ్చిమ లో శాసనసభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు పరిశీలిస్తే ఈసారి కాంగ్రెస్ కు ఓట్ల శాతం తగ్గి బిజెపి కి ఓట్లు వేశారు. ఒకటవ రౌండ్ నుండి 18 రౌండ్ల వరకు కాంగ్రెస్ కు బీజేపీకి మధ్య గట్టి పోటీ ఏర్పడింది.ఒకటో రౌండ్ లో పార్ల మెంట్ బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్ కు 4931 ఓట్లు, పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యకు 2890 ఓట్లు, రెండో రౌండ్ లో ఆరూరి రమేష్ కు 3665 ఓట్లు, కడియం కావ్యతో 3512 ఓట్లు, మూడవ రౌండ్ లో ఆరూరి రమేష్ 3356 ఓట్లు, కడియం కావ్య కు 3648, నాలుగో రౌండ్లో అరురికి 4125, కడియం కావ్య కు 2582,ఐదవ రౌండ్ అరు రికి 4217, కడియం కావ్య కు 3411,ఆరవ రౌండ్ ఆరూ రికి 2723, కడియం కావ్య కు 5254,ఏడవ రౌండ్ ఆరురికి 3549, కడియం కావ్య 4299,ఎనిమిదో రౌండ్ ఆరూరి కి 4522, కడియం కావ్య కు 2416, 9వ రౌండ్ ఆరురికి 2972 , కావ్య కు 4132, పదవ రౌండ్లో ఆరూరికే 3008, కడియం కావ్యకు 4676 ,11వ రౌండ్ ఆరూరికి 2003, కడియం కావ్య కు 4436,12 వ రౌండ్ ఆరూరికి 2778, కడియం కావ్య కు 4319,13వ రౌండ్ ఆరూరికే 4006, కడియం కు 3449,14వ రౌండ్ అరురికి 3206 , కావ్యకు3419 ,15వ రౌండ్ అరురికి 3318 , కావ్యకు 2876,16 వ రౌండ్ అరురికి 3597 , కావ్యకు 2347,17 వ రౌండ్ అరురికి 3501, కావ్యకు 3149,18 వ రౌండ్ అరురికి 1133 , కావ్యకు 2585 ఓట్ల వచ్చాయి.

గుండెపోటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-వాజేడు

గుండెపోటుతో వ్యక్తి మతి చెందిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలం పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది ఇది గ్రామానికి చెందిన ఇల్లెందుల వెంకటి (45) శ్వాస ఆగిపోయి పడిపోవడంతో అది గమనించిన బంధువులు ఉటావుటిన వాజేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు అక్కడి వైద్య అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108 సహాయంతో ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్య పరీక్షలు నిర్వహించి మతి చెందినట్లు నిర్ధారించారు.

అమలు కాని గుట్కా నిషేధం..?

మల్హర్‌లో విచ్చలవిడిగా అమ్మకాలు

పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

గుట్కా, పొగాకు తయారీ పదార్థాలను అరికట్టడానికి ప్రభుత్వం గతంలో అధికారిక ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో విక్రయాలు బహిరంగంగానే సాగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యువతపై ప్రభావం చూపుతున్న డ్రగ్స్, గంజాయిపై ఓవైపు ఉక్కుపాదం మోపుతూనే, మరోవైపు గుట్కా పాన్ మసాలాలపై నిషేధం విధిస్తూ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ద్వారా ఇటీవల ఉత్తర్వులు జారీ చేయించింది. పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలాలపై నిషేధం కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రజల ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకొని వీటి తయారీ, నిల్వలు, పంపిణీ, రవాణా, అమ్మకాలపై పూర్తిస్థాయిలో నిషేధం విధించినట్లుగా పేర్కొన్నారు. మే 24నుంచి ఏడాది పాటు నిబంధనలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. తాజా ఉత్తర్వుల్లో ఆహార భద్రత ప్రమాణాల చట్టం 2006 ప్రకారం ఈ నిషేధం అమల్లోకి వస్తుందని తెలిసింది. అయినా మండలంలో తాడిచెర్ల, పెద్దతూండ్ల, కొయ్యుర్, రుద్రారం, మల్లారం, కొండంపేట, వల్లెంకుంట, కాపురం గ్రామాల్లో గుట్కా, పాన్ మసాల వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. కొయ్యుర్, పెద్దతూండ్ల గ్రామాలు కేంద్రాలుగా పెద్దయెత్తున కిరాణ దుకాణాల్లో నిల్వలు పెట్టి మండలంలోని పలు గ్రామాల్లోని కిరాణ దుకాణాల్లో చేరవేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇంతా జరిగినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



క్షేత్రస్థాయిలో అమలు కానీ ఆదేశాలు...

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిషేధాన్ని అమలు చేయాలని చెప్పి పది రోజులు కావస్తున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడ అమలు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యానికి హానికరమైన గుట్కా విక్రయాలను వెంటనే నిర్మూలించాలని, ఇదే అదునుగా బడా వ్యాపారులు సరుకును నల్ల బజారులో అధిక ధరకు విక్రయించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికే చిరు వ్యాపారులకు విక్రయించే గుట్కా ప్యాకెట్లు సామగ్రిని రెండింతల ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని సమాచారం. ఇదే అదునుగా హోల్‌సెల్ వ్యాపారులతో పాటు పలువురు అక్రమంగా దందా చేసేవారు గుట్కాను వేరువేరు చోట్ల గోదాముల్లో రహస్యంగా నిల్వ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. దీంతో ప్రమాదకర క్యాన్సర్ తదితర వ్యాధుల నుంచి గుట్కా ప్రియులను దూరం చేయాలనే ప్రభుత్వ ఆలోచన ఆదిలోనే హంసపాదుగా మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదీఏమైనప్పటికీ ఆరోగ్యానికి హాని కలిగించే గుట్కాను నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్యంతో ఆర్టీసీ కాంట్రాక్టు డ్రైవర్ మృతి

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ కాంట్రాక్టు డ్రైవర్ ఎస్‌కె రియాజ్ (45) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. డ్రైవర్ రియాజ్ వరంగల్-2 డిపోలో పని చేసేవాడు.

రంజాన్ పండుగకు ముందు డ్రైవర్ రియాజ్ పండుగ ఖర్చుల నిమిత్తం డబల్ డ్యూటీ చేశాడు. గతంలో కొద్దిగా అనారోగ్యంగా ఉన్న వ్యక్తి డబల్ డ్యూటీ చేయడంతో ఇంకా అనారోగ్యంగా మారాడు. దీంతో అతని భార్య ఎంజీఎంలో చికిత్స చేయించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. రియాజ్ కుటుంబానికి ఆర్టీసీ అధికారులు న్యాయం చేయాలని గ్రామస్తులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, మైనార్టీ సంఘాల నాయకులు కోరుతున్నారు.

జనగామలో 'పల్లా' పతనం

కాంగ్రెస్‌కే మెజార్టీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన జనగామ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించడం, స్థానిక బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి షాక్‌నిచ్చింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ నుండి పోటీ చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై 15 వేల 783 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తాజా పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 39 వేల 749 ఓట్ల భారీ మెజార్టీ రావడం గమనార్హం. బిఆర్ఎస్‌కు ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాకుండా మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య కూడా ఇదే నియోజకవర్గానికి చెందిన నేత కావడం తెలిసిందే. తాజా పార్లమెంటు ఎన్నికలు బిఆర్ఎస్‌కు ఆశనిపాతంగా మారాయి.

భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన జనగామ అసెంబ్లీ నియోజకవర్గం వుంది. తాజా పార్లమెంటు ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ రావడం గమనార్హం. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 87 వేల 293 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశంకు 47,544 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌కు 28 వేల 452 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో 39 వేల 749 ఓట్ల భారీ మెజార్టీ కాంగ్రెస్‌కు రావడం చర్చనీయాంశంగా మారింది. జనగామ ఎమ్మెల్యేగా బిఆర్ఎస్‌కు చెందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి 6 నెలల కాలంలోనే తన ప్రభవాన్ని కోల్పోవడం సర్వత్రా చర్చకు దారితీసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను బిఆర్ఎస్ కేవలం జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లోనే విజయం సాధించింది. ఎన్నికల ఫలితాల అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ నుండి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమీకరణలు మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడ్డ బిఆర్ఎస్, పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో మరింత ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటుంది.

'పొన్నాల'కు ఎదురుదెబ్బే..

జనగామ నియోజకవర్గంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరారు. సీనియర్ నేతగా, మాజీ మంత్రిగా విశేష అనుభవమున్న పొన్నాల లక్ష్మయ్య, స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ఎంత ప్రయత్నించినా కాంగ్రెస్‌కు గట్టి పోటీనివ్వకపోవడం గమనార్హం.

పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం

పార్లమెంటు ఎన్నికల్లో ఘోర పరాజయంతో జనగామ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం ఆవిరించింది. 'పల్లా' అసెంబ్లీ ఎన్నికల్లో 15 వేల 783 ఓట్లతో విజయం సాధిస్తే, తాజా పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్‌కు 39 వేల 749 ఓట్ల భారీ మెజార్టీ రావడం జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కాపాడుకోవడం ఎలాగో తెలియక 'పల్లా' సతమతమయ్యే పరిస్థితి దాపురించింది.

ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుపై ప్రజల హర్షం

నవతెలంగాణ-భూపాలపల్లి

పార్లమెంటు ఎన్నికల ఫలితాలను వీక్షించడానికి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాల మేరకు మంగళవారం సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేసి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను, అభ్యర్థులు సాధించిన ఓట్ల వివరాలను ప్రదర్శన నిర్వహించారు. అధికారులు ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేయడంపై భూపాలపల్లి పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టిన నేపథ్యంలో భూపాలపల్లి పట్టణ ప్రజలు ఎన్నికల ఫలితాలను వీక్షించేందుకు వీలుగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాల మేరకు ఎల్ఈడి స్క్రీన్‌తో పాటు టెంట్లు, కుర్చీలు, మంచినీరు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్లు డీపీఆర్వో శీలం శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాలను వీక్షించడానికి వచ్చిన ప్రజలు మాట్లాడుతూ ఎన్నో పనులలో దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులకు, రోడ్లపై చిన్న చిన్న దుకాణాలు నడుపుకునే చిరువ్యాపారులు, ఆటో కార్మికులకు, వాహన దారులకు పార్లమెంటు ఎన్నికల ఫలితాలను వీక్షించేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.



ప్రజలు సౌకర్యార్థం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఎల్.ఈ.డి స్క్రీన్, టెంట్లు, కుర్చీలు, మంచినీరు, అత్యవసర మందులు ఏర్పాటు చేసి దూర ప్రయాణాలు చేసే వారికి సామాన్యులకు దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను వీక్షణకు ఏర్పాటు చేయడం చాలా సంతోషమని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను ప్రజలందరితో కలిసి వీక్షించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

యేసు కుటుంబానికి న్యాయం చేయాలి

మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు

నవతెలంగాణ-వాజేడు

ప్రజల కోసమే అడవి బాట బట్టి ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్నమంటూ చెప్పుకునే మావోయిస్టులకు ప్రజా ఆగ్రహం తప్పడం లేదు. పోలీసులే లక్ష్యంగా పెట్టుకొని అటవీ ప్రాంతంలో అమర్చిన మందు పాత్ర పేలి అమాయకుడు బలి కావడంతో వారి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రెజర్ బాంబు పేలి మత్యువాత పడిన ఏసు కుటుంబానికి న్యాయం చేయాలంటూ మంగళవారం వాజేడు మండల పరిధిలోని జగన్నాపురం వై జంక్షన్ నుండి హనుమాన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా పోరాటం అంటే అమాయకులను బలి చేయడమేనా అంటూ, అటవీ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరిగే హక్కు ఏజెన్సీవాసులకు లేదా అంటూ నినాదాలు చేశారు. యేసు మతిపై ప్రజాసంఘాలు స్పందించి తన కుటుంబానికి న్యాయం జరిగే విధంగా పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వంశీకృష్ణ గెలుపుతో సంబరాలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మంగళవారం పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ 1లక్ష31వేయి581 మెజార్టీతో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు సహకారంతో గెలుపొందిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడితేల రాజయ్య, మండల ఎంపీపీ చింతలపల్లి మలహల్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహదేవపూర్ : పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ భారీ విజయం సాధించారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి అభ్యర్థి గడ్డం వంశీకష్ణ లక్ష 31 వేల పైచిలుకు ఓట్లతో బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించారు.ఈ సందర్భంగా తన విజయంలో కీలకపాత్ర పోషించిన మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతతలు తెలిపారు.



పిడుగుపాటుకు రైతు మృతి

నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రమాదవశాత్తు పిడుగు పాటుతో నేరేడు కొమ్ము మలహల్‌రావు (52) అనే రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల పూర్తి కథనం ప్రకారం.. మలహల్‌రావు సాయంత్రం తన పామాయిల్ తోట వద్దకు పశువులు రాకుండా చూస్తానని వెళ్లినట్లుగా తెలిపారు.అయితే అకాల ఈదురు గాలి బీభత్సం తోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం తగ్గింపై, రాత్రైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యయలు పామాయిల్ తోట వద్దకు వెళ్లి వెతుకుతుండగా తోటలో శవమై కనిపించినట్లుగా కన్నీరుమున్నీరైయ్యారు. చలిపిడుగు వేయడంతో అక్కడికక్కడే చనిపోయినట్లుగా పేర్కొన్నారు. మతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో బాధిత కుటుంభం రోడ్డున పడింది. ఆర్థికంగా మతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కిట్స్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు

నవతెలంగాణ-హసన్‌పర్తి

హసన్‌పర్తి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించే బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2024 పోటీలు జూన్ 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు బ్యాట్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ పి.రమేష్‌రెడ్డి తెలిపారు. బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2024 బాలురు, బాలికలు, పురుషులు, మహిళల కోసం జూన్ 18వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కిట్స్ క్యాంపస్‌లోని ఇండోర్ స్టేడియంలో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కిట్స్ వరంగల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పింగిలి రమేష్ రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో యూట్యూబ్ జర్నలిస్ట్ మృతి

నవతెలంగాణ-గణపురం

మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన యూట్యూబ్ జర్నలిస్ట్ మరుపట్ల కుమార్ (51) సోమవారం రాత్రి మృతి చెందారు.గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మృతుడు కుమార్ కు భార్య ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రత్నం రవి మృతుడి పార్థివ దేహానికి పూలమాలవేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కంది బండ గ్రామంలో నీటికి కటకట

నాల్గు రోజులుగా నీటి సరఫరా బంద్

నవతెలంగాణ-ఆత్మకూరు

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని నీరు కుళ్ళ గ్రామ శివారు గ్రామమైన కందిబండ లో గ్రామస్తులు గత నాలుగు రోజుల నుండి ఎంతో ఇబ్బంది పడు తున్నట్లు గ్రామస్తులు తెలి పారు. కందిబండ గ్రామంలో 75 కుటుంబాలకు మంచి నీరు రాకపోవడంతో గ్రామస్తులు పక్కనే ఉన్న చెన్నకేశవ స్వామి టెంపుల్ దగ్గర ఉన్న చేతి పంపు నుండి గ్రామస్తులు కిలోమీటర్ దూరం నుండి నీరు తెచ్చుకున్నట్లు తెలిపారు. ఆ గ్రామంలో అన్ని నిరుపేద కుటుంబాలేనని మేము సొంతగా బోరు వేయించుకో నే స్థితిలో లేమని మా గ్రామ పంచాయతీ కార్యదర్శి కి మా సమస్య విన్నవించుకుంటే కరెంటు ఉండట్లేదు మేమేం చేయ ాలని సమాధానం చెబుతు న్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుపేద దళిత గ్రామమైన కందిబండను మిషన్ భగీరథ నీరు అందించి మా గ్రామానికి ఉన్న నీటి సమస్య తీర్చాలని వీటితోపాటు మా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సీసీ రోడ్లు వీధిలైట్లు సమస్యలను అధికారులు మా గ్రామాన్ని పర్యటించి ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధి కారులను గ్రామస్తులు కోరారు. మా గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉంది గత నాలుగు రోజుల నుండి నీటి సరఫరా రావట్లేదని మిషన్ భగీరథ నీరు అసలే రావట్లేదని గ్రామ కార్యదర్శి అసలే పట్టించుకోవట్లేదు అనేక సమస్యలు ఉన్నాయని అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

వరంగల్

బుధవారం | జూన్ 5, 2024 | www.navatelangana.com

ఉమ్మడి వరంగల్‌లో పార్లమెంట్ ఫలితాల దృశ్యమాలిక





















